ఆంధ్రజ్యోతి
5
ANDHRAJYOTHY
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శుక్రవారం 8 ఆగస్టు 2025

చేనేత రంగాన్ని అభివృద్ధి చేస్తాం

- మంత్రి సత్యకుమార్ యాదవ్
- ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



చేనేత కార్మికుడి విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న మంత్రి సత్యకుమార్, కలెక్టర్ చేతన్, పరిటాల శ్రీరామ్, చిలకం తదితరులు

ధర్మవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేనేత రంగాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయమని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణం లోని కదిరిగేటు వద్ద ఉన్న చేనేత విగ్రహానికి ఆయన కలెక్టర్ చేతన్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డితో కలిసి పూలమాలలు వేశారు. అనంతరం నిర్వహించిన చేనేత దినోత్సవసభలో మంత్రి మాట్లాడుతూ చేనేత జీవనోపాధిమాత్రమే కాదని, మన సంస్కృతి, ప్రత్యేకతకు నిదర్శనమన్నారు. ఇటువంటి గొప్ప రంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం సంకల్పించిందన్నారు. చేనేత రంగాన్ని జాతీయ స్థాయిలో ప్రోత్సహించేందుకే ప్రతి ఏటా జాతీయ చేనేత దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి ప్రభుత్వం నేరుగా రూ.25వేలు చెల్లిస్తుందన్నారు. చేనేతలపై జీఎస్టీ భారం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తున్నట్లు తెలిపారు. ధర్మవరంలో హ్యాండ్‌లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేయడానికి పదెకరాల స్థలాన్ని గుర్తించామని, త్వరలో భూమి పూజ నిర్వహిస్తామన్నారు. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం తరువాత చేనేత రంగమే అత్యధిక జనాభాకు ఉపాధి కల్పిస్తోందన్నారు. ప్రధాని మోదీ వన్‌డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ కింద ధర్మవరం చేనేతకు అవార్డు రావడం జిల్లాకే గర్వకారణమన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామన్నారు. మగ్గం ఉన్న ప్రతిఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. చిప్‌జాకార్డు తీసుకువస్తే చేనేతలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. చిలకం మధు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో చేనేత వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. ప్రస్తుతం చేనేతలకు మంచి రోజులు వచ్చాయన్నారు. అనంతరం ఉత్తమ చేనేత కార్మికులు కాంతమ్మ, ఆంజనేయులు, ఈశ్వరయ్య, రామకృష్ణలను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్, చేనేతజౌళిశాఖ ఏడీ మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, సంధారాఘవ, జయశ్రీ, బీజేపీ నాయకులు సాకే ఓబులేశు, జింకా చంద్ర, అంబటి సతీశ్ పాల్గొన్నారు.

పువ్వులు.. పండ్లు

తెచ్చామమ్మా..!

- నేడు వరలక్ష్మీ వ్రతం
- రేపు రాఖీ పౌర్ణమి
- మార్కెట్‌లలో మహిళల సందడి



హిందూపురంలో రద్దీగా ఉన్న మార్కెట్ ప్రాంతం, అమ్మవారి అలంకరణ కోసం పూల కొనుగోలు







గోరంట్లలో పూల కొనుగోలు



పెనుకొండలో....

హిందూపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వరలక్ష్మీ వ్రతం కోసం మహిళలు ఏర్పాట్లు చేసుకున్నారు. శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. అమ్మవారి పూజ కోసం చీరలు, పండ్లు, పూలు, అరటి పిలకలు, చెరుకు మొసులు తదితర పూజా సామగ్రిని కొనుగోలు చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా మార్కెట్‌లు గురువారం కిటకిటలాడాయి. గ్రామీణ ప్రాంత ప్రజలు పట్టణాల్లోని మార్కెట్‌లకు తరలివచ్చారు. పుట్టపర్తి, కదిరి, హిందూపురం, ధర్మవరం పట్టణాలలో మార్కెట్‌లు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. మరోవైపు శనివారం రాఖీ పండగ ఉండటంతో మహిళలు రాఖీలను కొనుగోలు చేయడానికి దుకాణాలకు క్యూ కట్టారు. పండగ సందర్భంగా పూల ధరలు భారీగా పెరిగాయి. బంతిపూలు కిలో రూ100, చామంతి రూ.200 నుంచి రూ.250, గులాబీలు రూ.350 నుంచి రూ.400, కాకడాలు రూ.800, మల్లెపూలు రూ.900, కనకాంబరాలు రూ.వెయ్యి దాకా ధర పలికాయి. అరటి మొసులు రూ.20, చెరుకు రూ.20, అరటి పండ్లు రూ.60 నుంచి రూ.80, యాపిల్, దానిమ్మ కిలో రూ.250 నుంచి రూ.300 పలికాయి. కలువ పూలు ఒక్కొక్కటి రూ.50కి విక్రయించారు. అమ్మవారికి అలంకరించే పూలను కర్ణాటక నుంచి దిగుమతి చేసుకున్నారు. వీటి ధరలను అమాంతంగా పెంచేశారు. ఇంట్లో వ్రతాన్ని ఆచరించే ఒక్కో కుటుంబం పూలకు మాత్రమే రూ.2వేల నుంచి రూ.3వేలు వెచ్చించాల్సి వచ్చింది. సంపన్న కుటుంబాలవారు రూ.5వేల నుంచి రూ.7వేల దాకా ఖర్చు చేశారు. వరలక్ష్మీ అమ్మవారి ముఖం బొమ్మ నిన్నమొన్నటి దాకా రూ.200 నుంచి రూ.300 ఉండగా.. గురువారం రూ.500 నుంచి రూ.600 వరకూ విక్రయించారు.

అవినీతిపై విచారించండి

- మంత్రి సవిత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బత్తలపల్లి, ఆగస్టు 7(ఆంధ్ర జ్యోతి): స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత సీరియస్ అయ్యారు. అవకతవకలపై పూర్తి స్థాయి లో విచారించి నివేదిక ఇవ్వాలని గురుకుల పాఠశాలల జిల్లా సెక్రటరీని ఆదేశించారు. స్థానిక గురుకుల పాఠశాలలో జరుగుతున్న అవినీతి గురించి మేడం గారు మరి....! శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనానికి మంత్రి సవిత స్పందించారు. విజయవాడ నుంచి గురుకుల పాఠశాలల కార్యదర్శి మాధవీలతకు ఫోన్ చేసి బత్తలపల్లి గురుకుల పాఠశాలలో అవినీతి అక్రమాలపై విచారించా లని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ప్రజలు, విద్యార్థుల సంక్షేమం కోసం పని చేస్తుంటే కొందరు అవినీతిపరుల వల్ల ప్రభుత్వానికి నష్టం కలుగుతోందని మంత్రి ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ఉపకరణాలకు 180 మంది ఎంపిక

కొత్తచెరువు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ప్రత్యేక అవసరాల పిల్లల కోసం పంపిణీ చేసే ఉపకరణాలకు 180 మంది ఎంపికైనట్లు సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ దేవరాజ్ తెలిపారు. స్థానిక సత్యసాయిబాబా భజన మందిరంలో ఎంపికైన వారిని వైద్యులు గురువారం పరీక్షించారు. ఎవరికి ఏ లోపం ఉందో గుర్తించి, వారికి అవసరమైన పరికరాలను అందించేందుకు చర్యలు తీసుకున్నారు. 180 విద్యార్థులకు 204 ఉపకరణాలు అవసరమని గుర్తించినట్లు వెల్లడించారు. ఇందుకోసం రూ.14.31లక్షలు అవసరమవుతుందన్నారు. ఈ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించి పిల్లలకు ఉపకరణాలను అందిస్తాయని తెలిపారు. కార్యక్ర మంలో సహితవిద్య సమన్వకర్త ఆనంద్‌బాబు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాబందులు వచ్చేశాయ్..!

చిలమత్తూరు మండలంలోని టేకులోడు సెజ్‌లో దళారులు పాగా వేశారు. పరిశ్రమల కోసం ప్రభుత్వ చేపట్టిన భూసేకరణ ప్రక్రియలో భూములు కోల్పోయిన రైతుల కంటే వీరే ఎక్కువ లబ్ధిపొందుతున్నారు. మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం భూమి సేకరిస్తోంది. ఇందులో భాగంగా టేకులోడు రెవెన్యూ గ్రామంలో రైతుల నుంచి భూములను సేకరించి వారికి పరిహారాన్ని అందిస్తోంది. ఇదే అదనుగా భావించిన కొందరు దళాలరుల అవతారం ఎత్తి అమాయక రైతులను భయపెట్టి దోచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే ఇద్దరు అధికారులు దళారులకు అండగా ఉంటూ వాటాలు పంచుకుంటున్నట్లు సమాచారం.

చిన్న వివాదాలతో రైతుల్లో ఆందోళన సృష్టి

సమస్యను పరిష్కరిస్తామని రూ.లక్షల్లో వసూలు

ఇద్దరు అధికారుల అండతో సెటిల్‌మెంట్లు

టేకులోడు సెజ్‌లో దళారులు పాగా





టేకులోడు వద్ద ప్రభుత్వం సేకరిస్తున్న భూములు

చిలమత్తూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): టేకులోడు ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం భూసేకరణ ప్రారంభించింది. రైతులు సాగులో ఉన్న 600 ఎకరాల అసైన్డ్ భూములను సేకరిస్తోంది. ఎకరానికి రూ. 12,66,067లుగా ప్రభుత్వం పరిహారాన్ని అందిస్తోంది. ఇదే అదనుగా కొందరు దళారుల అవతారం ఎత్తి అమాయక రైతులను టార్గెట్ చేస్తున్నారు. ప్రధానంగా చిన్న చిన్న భూసమస్యలు ఉన్న రైతులను గుర్తించి వారికి లేనిపోని భయాలను పుట్టిస్తున్నారు. భూమి వివాదాస్పదంగా ఉందని, పరిహారం ఇవ్వడం కుదరదని తమతో కలిస్తే అధికారులతో మాట్లాడి పరిహారం అందేలా చేస్తామని చెప్తున్నారు. ఒకవేళ తమతో కలిసిరాకపోతే మీ భూమికి పరిహారం వెనక్కి పోతుందని (మిగతా 6లో...)

అన్నదాత ఎదురుచూపు

- పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ సొమ్ము జమలో జాప్యం
- కొందరికి ఒక్కటే పడిన వైనం
- రైతు సేవాకేంద్రాలకు రైతుల పరుగు (7లో...)

సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడి

ఆత్మహత్య

కుటుంబ కలహాలు, అప్పులతోనే.. (7లో...)

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



జిల్లా బాస్కెట్‌బాల్ బాలబాలికల జట్లతో అసోసియేషన్ ప్రతినిధులు

ధర్మవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బాస్కెట్‌బాల్ జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని బాస్కెట్‌బాల్ క్రీడామైదానంలో గురువారం బాల, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయ్‌భాస్కర్, ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ హిదయ్‌తుల్లా ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎంపికైన జట్లు త్వరలో జోనల్ స్థాయిలో తిరుపతిలో జరిగే బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటాయన్నారు.


జట్ల వివరాలు..

బాలికల జట్టు: కిరణ్మయి, నిఖ్య, అలేఖ్య, అంజన, యశశ్విని, శరణ్య, ప్రియదీప్తి, మనిత, ఇంద్రజ, కేతన, మౌనిక, వైష్ణవి.

బాలుర జట్టు: విజయ్‌తరుణ్, మంజునాథ్, కార్తీక్‌నాయక్, అశోక్, లక్ష్మీనారాయణ, సాయికుమార్, యేసు, నాగేంద్ర, చైతన్యసాయి, పంతోష్, అబ్దుల్, రేనంక్.

బియ్యం.. బొక్కేస్తున్నారు..!

- పక్కదారి పడుతున్న పీడీఎస్ బియ్యం
- కొందరు డీలర్ల నుంచే నేరుగా వ్యాపారులకు..
- కిలో రూ.15 నుంచి రూ.20 చొప్పున విక్రయం
- తేటతెల్లం చేస్తున్న బఫర్ లెక్కలు
- ఒక్కో షాపు నుంచి ప్రతినెలా 20 సంచుల వరకు..
- అనంత నగరం, పట్టణాల్లోనే అధికం



అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని బొక్కేస్తున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్)లో ఏకంగా బియ్యం సంచులే మాయమవుతున్నాయి. నేరుగా వ్యాపారులకు బియ్యం చేరుతోందనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. అందుకు ఎఫ్‌పీ షాపుల్లో కనిపిస్తున్న బఫర్ స్టాకే నిదర్శనం. కొన్ని దుకాణాల్లో పదుల సంఖ్యలో బియ్యం బస్తాల కొరత కనిపిస్తోంది. పేదల బియ్యం ద్వారా డబ్బు దోచుకునే వ్యవహారం గత వైసీపీ హయాంలో జోరుగా సాగింది. కూటమి ప్రభుత్వంలోనూ కొందరు డీలర్లు కొనసాగిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు మాత్రం ముడుపులతో చర్యలు తీసుకోలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా ప్రజలకు అందాల్సిన బియ్యం కొందరు అక్రమార్కుల పాలవుతోంది. ఈ దందా జిల్లా కేంద్రమైన అనంతపురంతోపాటు పట్టణాల్లోనే ఎక్కువగా సాగుతోంది. మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లోనూ పెద్దఎత్తున పక్కదారి పట్టిస్తున్నట్లు తెలుస్తోంది.

డీలర్ల నుంచి నేరుగా వ్యాపారులకు...

జిల్లాలో చాలామంది బియ్యం వ్యాపారులు ఉన్నారు. వీరంతా మేలు రకాలైన బియ్యం వ్యాపారం చేసేవారు కాదు. రేషన్ షాపుల్లో పేదలకు అందించే బియ్యం కొనుగోలు చేసి పాలిష్ చేసి సన్నబియ్యంగా మార్చి అధిక ధరలకు విక్రయిస్తుంటారన్న ఆరోపణలున్నాయి. ఇలాంటి వ్యాపారులు కొంతకాలంగా పెరుగుతున్నారు. పెద్దమొత్తంలో సబ్సిడీ బియ్యం లభిస్తుండడంతో దందా సాగిస్తున్నారు. రేషన్‌షాపు డీలర్ల నుంచే పీడీఎస్ బియ్యం వీరికి వెళ్తోంది. బఫర్‌లో కనిపిస్తున్న లెక్కల వివరాలు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. కీలకమైన డీలర్ షాపుల నుంచి 5 నుంచి 10 బస్తాల వరకు వెళ్తుండగా, మరి కొందరి నుంచి 20 బస్తాలదాకా కూడా పక్కదారి పడుతునట్టుల్లు సమాచారం. కిలో రూ.15 నుంచి రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు.

భారీ బఫర్...

రేషన్ షాపుల్లో కనిపిస్తున్న బఫర్ పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా ఏ స్థాయిలో జరుగుతోందో తేటతెల్లం చేస్తుంది. జిల్లావ్యాప్తంగా 1,645 రేషన్ దుకాణాలు ఉండగా... 6.25 లక్షల మంది కార్డుదారులున్నారు. ప్రతినెలా సుమారు 10వేల టన్నుల పీడీఎస్ బియ్యం సరఫరా అవుతుంది. అనంతపురం నగరంలో 137 ఎఫ్‌పీ షాపులున్నాయి. ప్రతి బస్తా లో 50 కిలోల పీడీఎస్ బి య్యం ఉంటుంది. వాటి లో 80 నుంచి 100 బస్తాలు (మిగతా 6లో...)

చిక్కింది చాన్స్ అని..

మహిళా సంఘాల సొమ్ము స్వాహా

- రూ.30లక్షల మేర కాజేసిన వైనం
- రికవరీకి అధికారుల ప్రయత్నాలు
- పోలీసులకు మహిళా సంఘాల ఫిర్యాదు
- ఆకుతోటపల్లిలో ఓ యానిమేతర్ ఘనత..!

మండల ఏపీఎం కార్యాలయం



అనంతపురంరూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల్లో సభ్యుల నమ్మకాన్ని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు యానిమేటర్లు స్వాహా పర్వానికి తెర తీశారు. ఇలాంటి వ్యవహారమే రూరల్ మండలంలోని ఆకుతోటపల్లిలో వెలుగులోకి వచ్చింది. అక్కడ పని చేసే ఓ యానిమేటర్ మహిళా సంఘాల సొమ్మును తన ఖాతాలోకి మళ్లించుకుని స్వాహా చేశారు. ఇలా దాదాపు రూ.30 లక్షల మేర కాజేసినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు వ్యవహారం బయటకు పొక్కకుండా యానిమేటర్‌తో రికవరీ చేయిస్తున్నారు.

పొదుపు.. అప్పుల విచారణతో వెలుగులోకి..

వైసీపీ అధికారంలోకి వచ్చాక గ్రామంలో పని చేస్తున్న యానిమేటర్‌ను తొలగించారు. అతడి స్థానంలో అప్పటి రాజకీయ నాయకుల ఒత్తిడితో ఓ మహిళను యానిమేటర్‌గా నియమించారు. 2021 ఆగస్టు నుంచి 2024 జూన్ ఆఖరి వరకు ఆమె పని చేశారు. ఆ సమయంలోనే మహిళల సొమ్ము స్వాహా జరిగినట్లు తెలుస్తోంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తిరిగి యానిమేటర్ మార్పు జరిగింది. ఈక్రమంలో గ్రూపులు, సభ్యుల అప్పులు, పొదుపు వివరాల విచారణ క్రమంలో స్వాహా వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది.

నమ్మకం, అమాయకత్వమే ఆసరా

గ్రామాల్లో చాలా మంది కూలి పనులు, వ్యవసాయ పనులు ఇతరత్ర వాటికి వెళ్లి జీవనం సాగిస్తుంటారు. అలా వచ్చిన సొమ్మును డ్వాక్రా సంఘాల ద్వారా పొదుపు చేసుకుంటారు. అవసరార్థం సంఘంలో అప్పు తీసుకుని నెల..నెలా చెల్లిస్తారు. ఈక్రమంలో చాలా మంది యానిమేటర్‌ను మీదనే ఆధారపడి చెల్లింపులు చేస్తుంటారు. ఇదే ఆసరగా ఆ యానిమేటర్ గ్రూపు సభ్యుల సొమ్మును కాజేసినట్లు తెలు స్తోంది. ఈక్రమంలో రూ.పదిహేను లక్షలకుపైగానే కాజేసినట్లు తెలు స్తోంది. తన కంటూ ఓ ప్రత్యేక తీర్మానం చేసుకుని గ్రూప్రసభ్యులతో సంతకాలు చేయించుకున్నట్లు తెలుస్తోంది. అందులో తన సొంత (మిగతా 6లో..)

కదిరి బైపాస్ రోడ్డుపై రాకపోకలు ప్రారంభం

కదిరి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించిన కదిరి బైపాస్ రోడ్డులో రాకపోకలను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గురువారం ప్రారంభించారు. బైపాస్ రోడ్డు నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వం అప్పట్లో రూ.286 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఆ తరువాత కొలువుదీరిన వైసీపీ ప్రభుత్వం పనులను అటకెక్కించింది. గతేడాది కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే బైపాస్ రోడ్డులో రాకపోకలకు చర్యలు తీసుకుంది. హిందూపురం రోడ్డునుంచి మదనపల్లి రోడ్డు వరకు బైపాస్ రోడ్డు పూర్తయింది. ఆ రోడ్డులో రాకపోకలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధిలో భాగంగా ఈ బైపాస్ రోడ్డులో రాకపోకలు ప్రారంభించామన్నారు. ఇకనుంచి భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, పెద్ద ఆటోలు హిందూపురం రోడ్డునుంచి బైపాస్‌రోడ్డులో వచ్చి పీవీఆర్ సర్కిల్‌లోని కదిరి, మదనపల్లి రోడ్డులో కలుస్తాయి. అక్కడి నుంచి నేరుగా బస్టాండు వైపు వెళ్తాయి. పట్టణంలో ట్రాఫిక్ తగ్గించాలన్న ఉద్దేశంతో ఈరోడ్డులో రాకపోకలు ప్రారంభించినట్లు చెప్పారు. హిందూపురం, బెంగుళూరునుంచి వచ్చే ప్రయాణీకులకు అసౌకర్యంగా ఉన్నా.. పట్టణ అవసరాల దృష్ట్యా సర్దుకుపోవాలన్నారు. త్వరలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఆధ్వర్యంలో రెండు, మూడు ఎలక్ట్రిక్ బస్సులను ఏర్పాటు చేసి, ఎంపీడీఓ కార్యాలయ సర్కిల్ నుంచి కోనేరు వరకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఇది భక్తులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శివనారాయణస్వామి, కమిషనర్ కిరణ్‌కుమార్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బైపాస్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

చిత్రావతి సుందరీకరణకు శ్రీకారం

పనులకు జోయాలుక్కాస్ రూ.1.2 కోట్ల విరాళం(వివరాలు 7లో...)

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

హిందూపురం, మడకశిర, పెనుకొండ	:9985445760
ధర్మవరం, పుట్టపర్తి	: 9963160529
కదిరి	:9052518170

ఏసీఎం: 9985411154

పుట్టపర్తికి నిధులివ్వండి

కేంద్ర మంత్రికి ఎంపీ బీకే వినతి



కేంద్ర పర్యాటక మంత్రి షెఖావత్‌కు వినతిపత్రం అందిస్తున్న బీకే

పెనుకొండ, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిని అంతర్జాతీయ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి నిధులు ఇవ్వాలని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెఖావత్‌కు హిందూపురం ఎంపీ పార్థసారథి విన్నవించారు. అభివృద్ధి ప్రణాళికను పరిశీలించి, ఈ ప్రాజెక్టుకు ఆర్థిక సాయం అందించాలని కోరుతూ గురువారం వినతి పత్రం సమర్పించారు. ఢిల్లీలో ఆయన కేంద్ర మంత్రిని కలిశారు. భగవాన్ సత్యసాయి బాబా జన్మస్థలమైన పుట్టపర్తి ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందుతోందని వివరించారు. అనేక దేశాల భక్తులు పుట్టపర్తిని సందర్శిస్తున్నారని అన్నారు.అలాంటి పుట్టపర్తిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని కేంద్ర మంత్రికి వివరించారు.

సెలవుల సందడి

ప్రయాణికులతో కిక్కిరిసిన ఆర్టీసీ బస్టాండ్లు

అనంతపురం టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలో ప్రధాన పండుగలైన వరలక్ష్మీ వ్రతం, రాఖీ పౌర్ణమి వరుసగా రావడం, ఆ మరుసటిరోజే ఆదివారం సెలవు కావడంతో జిల్లావ్యాప్తంగా సందడి వాతావరణం కనిపిస్తోంది. విద్యాసంస్థలకు వరుసగా మూడురోజులు సెలవులు వదలడంతో విద్యార్థులంతా సొంతూరి బాట పట్టారు. దీంతో గురువారం అనంతపురం బస్టాండు ప్రయాణికులతో కిటకిటలాడింది. తమ ఊరి బస్సులో సీట్లు పట్టుకునేందుకు పిల్లలు, పెద్దలు ఎగబడ్డారు. బస్సు సర్వీసులు తక్కువగా ఉండే రూట్లలో తమ ఊరి బస్సు ఎప్పుడొస్తుందా అంటూ ప్రయాణికులు వేచిచూడడం కనిపించింది. మొత్తంగా వరుస సెలవుల కారణంగా గురువారం రీజియన్ వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్లన్నీ కిక్కిరిసిపోయాయి.



అనంతపురం: మా ఊరి బస్సు ఎప్పుడొస్తుందో.. ఏమో..





సీటు దొరికితే చాలు.. పండుగే..



వామ్మో.. ఏమి జనం..! ఇసుకేస్తే నేలరాలదంతే..!

చేనేత వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- ఏపీ చేనేత సంఘం నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీ చేనేత సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీరాములు, గోవిందు డిమాండ్ చేశారు. ఏపీ చేనేత సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నగరంలో నేతన్నలు భారీ ర్యాలీ నిర్వహించారు. నేత బజార్ వద్ద నేతన్నల మెడకు ఉరితాళ్లు బిగించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా చేనేత నాయకులు మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేనేత కుటుంబాలకు ఏడాదికి రూ.36వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబానికి రూ.7లక్షలు చెల్లిస్తామని విస్మరించడం దారుణమన్నారు. చేనేతలకు బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయిస్తామన్న ప్రభుత్వం ఇంతవరకు ఒక్క పైసా కూడా కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య మాట్లాడుతూ చేనేతలను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ర్యాలీలో పురుషోత్తం, వెంకటరమణ, శేఖర్, ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, రామాంజి తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో చేనేత కార్మికుల ర్యాలీ

మహాత్మా...! కళ్లు తెరిపించు

- గాంధీ విగ్రహానికి చేనేతల వినతి

ధర్మవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మహాత్మా..! పాలకుల కళ్లు తెరిపించి, చేనేత కార్మికులను కాపాడేలా చూడాలని గాంధీ విగ్రహానికి ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకుడు ఎస్‌హెచ్‌బాషా వినతి పత్రం ఇచ్చారు. జాతీయచేనేత దినోత్సవం సందర్భంగా గురువారం ఏపీ చేనేత కార్మికసంఘం ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన జీఎస్టీ రద్దు, నేతన్న నేస్తం వంటి హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంపర్తి పరమేశ్, చేనేత కార్మికసంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఖాదర్‌బాషా, గుంపుహరి, జంగాలపల్లిపెద్దన్న, జేవీరమణ, మారుతి, అయూబ్‌ఖాన్,ఎల్ ఆదినారాయణ, వెంకటస్వామి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చేనేత కార్మికసంఘం, కాంగ్రెస్ నాయకులు

జాతీయ అవార్డు అందుకున్న ధర్మవరం డిజైనర్

ధర్మవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చేనేత డిజైనర్ జూజూరు నాగరాజు కేంద్ర మంత్రి నుంచి జాతీయ అవార్డును అందుకున్నారు. దేశరాజధాని న్యూఢిల్లీలో 11వ జాతీయ చేనేత దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వం గురువారం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి దేశంలోని పలువురు చేనేత కార్మికులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించారు. ఈక్రమంలోనే పట్టు చీరలపై అద్భుతాలు సృష్టించి, ఎన్నో పురస్కారాలు అందుకున్న నాగరాజును గుర్తించి కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేంద్రజౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్, ఎంపీ కంగనారనౌత్, హ్యాండ్‌లూమ్ కమిషనర్ బీనా, ఇతరశాఖల మంత్రులు, అధికారుల చేతుల మీదుగా నాగరాజుకు అవార్డును అందజేశారు.



కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ నుంచి జాతీయస్థాయి అవార్డు అందుకుంటున్న డిజైనర్ జూజూరు నాగరాజు

చిక్కింది చాన్స్ అని..

(5వ పేజీ తరువాయి)

బ్యాంకు ఖాతా నెంబరు రాసుకుని తీర్మాన కాపీలను బ్యాంకులో ఇచ్చి..రుణాలు, ఇతరత్ర సొమ్ము మరో రూ.14లక్షలు తన ఖాతాలో జమ చేసుకున్నట్లు తెలుస్తోంది. తన పరిధిలోని ఒక్కో గ్రూపులో రూ.యాభై వేలు మొదలు కొని..రూ.లక్ష, రెండు లక్షలు, నాలుగు లక్షల వరకు గ్రూపు సభ్యులకు తెలియకుండా సొమ్మును తన సొంత ఖాతాలోకి జమచేసుకున్నట్లు సమాచారం. దాదాపు పది గ్రూపులకు సంబంధించిన సభ్యుల సొమ్మును ఎవరికి అనుమానం రాకుండా కాజేసినట్లు చర్చసాగుతోంది.

గుట్టుగా రికవరీ

డ్వాక్రా సంఘంలో జరిగిన అవినీతిని తెలుసుకున్న సంబంధిత అధికారులు గుట్టుచప్పుడుకాకుండా రికవరీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారుల లెక్కప్రకారమే రూ.20లక్షలకు పైగానే సొమ్ము స్వాహా అయినట్లు తెలుస్తోంది. పెద్ద ఎత్తున అవినీతి జరిగినప్పటికీ ఉన్నతాధికారులకు తెలియకుండా కిందిస్థాయిలోనే వ్యవహారాన్ని సద్దుమణిచేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం. వ్యవహారం బయటకు పొక్కకుండా యానిమేటర్‌కు గడువు ఇప్పించి నడిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మహిళల పొదుపు సొమ్ము స్వాహాలో అధికారుల పాత్ర కూడా ఉందేమోనన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పోలీసులకు ఫిర్యాదు..

స్వాహా చేసిన సొమ్ము చెల్లించేందుకు యానిమేటర్‌కు ఇచ్చిన గడువు ముగియడంతో సోమవారం గ్రీవెన్స్‌లో పోలీసు ఉన్నాతాధికారులకు పలువురు గ్రూపు సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇటుకలపల్లి పోలీ సులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. గురువారం కూడా ఇద్దరు, ముగ్గురు మహిళలు తమ సొమ్ము స్వాహాపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొన్ని నెలల కిందట మండలంలోని రాచానపల్లిలోను ఇలాంటి సంఘటనే జరిగింది. ఉన్నతాధికారులు పర్యవేక్షించడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటేనే ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందనే చర్చ సాగుతోంది.

స్వాహా నిజమే: రవి, ఏంపీఎం, అనంతపురం రూరల్ మండలం



ఆకుతోటపల్లి గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళలకు సంబంధించి న సొమ్మును గతంలో పని చేసిన యానిమేటర్ తన సొంత ఖాతాలోకి జమ చేసుకున్న విషయం వాస్తవమే. సొమ్ము తన ఖాతాలోకి పడేటట్లు తీర్మానం చేసుకుని, ఆ కాపీని బ్యాంకులో ఇచ్చి, ఆమేరకు తన పరిధిలోని సంఘాల మహిళలకు సంబంధించిన సొమ్మును స్వాహా చేసింది. మా విచారణలో రూ.20లక్షల వరకు యానిమేటర్ గ్రూపు సభ్యులకు తెలియకుండా తీసుకుంది. ఇటీవల మరికొంత మంది తమ సొమ్మును యానిమేటర్ తీసుకుందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ లెక్కలు మాదాక రాలేదు. మా దృష్టికి వచ్చిన మేరకు ఆ యానిమేటర్‌తో సొమ్ము రికవరీ చేయిస్తున్నాం. ఇప్పటి వరకు రూ.5లక్షల దాకా చెల్లించారు.

బియ్యం.. బొక్కేస్తున్నారు..!

(5వ పేజీ తరువాయి)

బఫర్ ఉన్న ఎఫ్‌పీ షాపులు 25 వరకు ఉన్నట్లు సమాచారం. అంటే ఒక్కో దుకాణంలో 4వేల నుంచి 5వేల కిలోల బఫర్ ఉంది. మరికొన్ని ఎఫ్‌పీ షాపుల్లో 20 నుంచి 50 బస్తాల వరకు బఫర్ ఉన్నట్లు చూపుతున్నారు. ఇలా మొత్తం టన్నుల్లో బఫర్ చూపుతోంది. ఇక కళ్యాణదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు పరిధిలో ఒక్కోచోట 500 క్వింటాళ్ల నుంచి 1000 క్వింటాళ్ల వరకు బఫర్ ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లాలో ఎక్కడైనా రేషన్ తీసుకునే వెసులుబాటును కొందరు డీలర్లు క్యాష్ చేసుకుంటున్నారు. వారందరికీ ఇచ్చేశామని చెప్పి స్థానికులకు ఇవ్వకుండానే లేవని తిప్పి పంపుతున్నారు. పట్టణాలు, మండలకేంద్రాల్లో ఈ వ్యవహారం ఎక్కువగా సాగుతోంది.

ఆన్‌లైన్‌లో కనిపిస్తుంటే ఏం చేస్తున్నట్లు...?

డీలర్ అంటే అధికార పార్టీ నాయకుల సిఫార్సులతో వచ్చిన వ్యక్తే. వైసీపీ హయాంలో కొందరు డీలర్లు పీడీఎస్ బియ్యం అమ్ముకుని బఫర్ వచ్చేలా చేశారు. కూటమి పాలనలోనూ కొందరు డీలర్లు అదే వైఖరి అవలంబించారు. కొందరు అమ్మకపోయినా గతంలో చేసిన వారి అక్రమ వ్యాపారంతో బఫర్ ప్రభావం కొనసాగుతోంది. బఫర్ ఎందుకు వస్తుంది, ఎవరెవరు వ్యాపారులకు పీడీఎస్ బియ్యం అమ్ముతున్నారనేది పౌరసరఫరాల శాఖ అధికారులకు తెలుసు. ఆన్‌లైన్‌లో ఏ షాపులో ఎంత బియ్యం ఉంది..? ఎంత పంపిణీ చేస్తున్నారనేది తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు సీఎస్‌డీటీలకు నెలవారీ ముడుపులు వెళ్తున్నాయనే ఆరోపణలున్నాయి. మరికొందరు డీలర్లు అధికార పార్టీ నేతల పేరు చెప్పుకుని తమ వద్దకు ఎవరూ రాకుండా చూసుకుంటున్నారు.

మేమెట్టా బతకాలి..?

అనంతపురం పరిధిలో బఫర్ ఉన్న డీలర్లను తాజాగా అధికారులు పిలిపించుకున్నారు. ఈసారి బఫర్ లేకుండా బియ్యం సరఫరా చేయాలనే విషయంపై చర్చించారట. అదే క్రమంలో ఇకపై బియ్యం అమ్మడం లాంటివి జరిగితే 6ఏ కేసులు బనాయిస్తామని హెచ్చరించారట. ఈ క్రమంలో ఓ మహిళా డీలర్ 20 బస్తాలు అమ్మినట్లు తేలడంతో అధికారులు మరోసారి ఇలా జరగకూడదని చెప్పారట. దీంతో ఆ డీలర్ 'మాకు వచ్చే 50కిలోల బస్తాలో 43 కిలోలు మాత్రమే బియ్యం ఉంటోంది. మరి మేమెలా బతకాలి. మేమూ డబ్బాలుంచుకోవాలి కదా..' అని ప్రశ్నించడంతో సంబంధిత అధికారులు కిమ్మనకుండా ఉండిపోయారట.

డీలర్లు పీడీఎస్ బియ్యం విక్రయిస్తే చర్యలు



అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొన్ని రేషన్ షాపుల్లో షార్టేజ్(బఫర్)తక్కువగా ఉన్న విషయం వాస్తవమే. ఎవరైనా రేషన్ డీలర్లు పీడీఎస్ బియ్యం విక్రయిస్తే చర్యలు తప్పవు. కొందరు కేవలం థంబ్ వేసి బియ్యం తీసుకోవడం లేదనే విషయం మా దృష్టికి వచ్చింది. ఆ క్రమంలో తనిఖీలు చేసినప్పుడు చౌకధరల దుకాణంలో బియ్యం తక్కువ ఉన్నా, ఎక్కువ ఉన్నా విచారిస్తాం. గత కొన్ని నెలల్లో జిల్లా వ్యాప్తంగా 40కుపైగా కేసులు నమోదు చేశాం.

-వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ

రాబందులు వచ్చేశాయ్..!

(5వ పేజీ తరువాయి)

భయపెడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే ఇద్దరు అధికారులు దళారులు తీసుకువచ్చే వివాదాస్పద భూముల రైతులను మరింత భయపెడుతున్నారు. దీంతో అమాయక రైతులు పరిహారం రాదేమోనన్న ఆందోళనతో దళారీలు చెప్పినట్లు వింటున్నారు. రైతులను, తహసీల్దార్ కార్యాలయంలో పని చేసే ఇద్దరు అధికారులను ఒకచోట కూర్చోబెట్టి పరిహారం అందేవిధంగా చేస్తున్నందుకు లక్షల్లో వసూలు చేస్తున్నట్లు సమాచారం.

సెటిల్‌మెంట్లతో రంగంలోకి..

టేకులోడు సెజ్‌లో భూవివాదాలు లేకపోయినా వారసులు, హక్కుదారులు అంటూ కొత్త వ్యక్తులను తెరపైకి తీసుకుచ్చి కొత్త వివాదాలను సృష్టిస్తున్నారు. భూసమస్య ఉన్నట్లు తహసీల్దార్ కార్యాలయంలో అర్జీలు ఇప్పించి పరిహారం అందకుండా నిలుపుదల చేస్తున్నారు. అనంతరం సెటిల్‌మెంట్ల పేరుతో రంగంలోకి దిగుతున్నారు. ఎకరానికి రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు కమీషన్ మాట్లాడుకొని భూవివాదాన్ని సెటిల్ చేస్తున్నట్లు సమాచారం. అయితే ఇందులో ఓ ఇద్దరు అధికారుల పాత్ర క్రియాశీలకంగా ఉన్నట్లు పుకార్లు వస్తున్నాయి.

ఆ ఇద్దరిదే కీలకపాత్ర!

వివాదాస్పదంగా ఉన్న భూములను టార్గెట్ చేస్తూ ఆ ఇద్దరు అధికారులు పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకోవడానికి పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. సామరస్యంగా పరిష్కారమయ్యే భూసమస్యలను పెద్దవిగా చేస్తూ రైతులను కార్యాలయం చుట్టూ తిప్పుకునేలా చేస్తున్నారు. అన్నదమ్ములు, వారసులు, ఒకరు పట్టాదారుడుగా ఉంటూ సాగులో వేరే వ్యక్తి ఉండటం, నిజమైన హక్కుదారుడైనా రికార్డులో అపరిష్కృత భూమిగా ఉండటం వంటి విషయాలను గుర్తించి వారి నుంచి పెద్ద మొత్తంలో డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. కాదు కూడదు అంటే రికార్డులు మాచేతుల్లో ఉంటాయి. పరిహారం అందకుండా చేయగలం అనే మాట చెప్తున్నట్లు తెలుస్తోంది. దీంతో విధిలేక ఆ ఇద్దరు చెప్పిన మాటకి సరే అని డీల్‌కి ఒప్పుకుంటున్నారు.

రూ. లక్షల్లో డిమాండ్

వివాదాస్పదంగా ఉన్న భూ వ్యవహారాన్ని పరిష్కరించేందుకు ఒక్కో రైతు నుంచి ఎకరానికి రూ. లక్ష వరకు దళారులు ఆ ఇద్దరు అధికారులను కలుపుకొని డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. పరిహార నగదు రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ అవుతుండటంతో ఆ ఇద్దరి అధికారులకు ఇచ్చే వాటాకి దళారులే మధ్యవర్తిగా ఉంటున్నట్లు సమాచారం. ఇప్పటికే 600 ఎకరాల భూసేకరణలో 60 మంది రైతుల భూములు వివిధ కారణాలతో వివాదాస్పదంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. రోజూ ఏదో ఒక కారణంతో అర్జీలు వస్తున్నట్లు చెప్తున్నారు. ఇలా అర్జీలు వచ్చిన భూములకు పరిహారం ఇవ్వడానికి బ్రేక్ పడుతోంది. ఆందోళనతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. వారు సెటిల్‌మెంట్ చేసి పరిహారాన్ని పంచుకుంటున్నట్లు సమాచారం.

దళారులను నమ్మొద్దు: ఆనంద్‌కుమార్, పెనుకొండ ఆర్డీఓ



టేకులోడు సెజ్ భూముల పరిహారం పొందే విషయంలో ఎవరు దళారులను ఆశ్రయించవద్దు. సమస్య ఏదైనా ఉంటే మా వద్దకు తీసుకురావాలి. దళారులు చెప్పే మాటలు నమ్మి వారికి డబ్బులు ఇచ్చే పని చేయవద్దు. దళారులు చెప్పినవిధంగా ప్రభుత్వ అధికారులు ఎవరూ వినరు. ఈ విషయాన్ని రైతులు గుర్తించాలి. దళారులకు వెన్ను దన్నుగా కార్యాలయ సిబ్బంది ఎవరు ఉన్నా ఉపేక్షించేది లేదు. రైతులకు అందజేసే పరిహారం విషయంలో దళారులతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిస్తే చర్యలు తప్పక ఉంటాయి. రైతులు నేరుగా తహసీల్దార్‌కి కానీ, పెనుకొండలో నాకు కానీ సమస్య తెలుపుకోవచ్చు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొని న్యాయం చేస్తాం.

స్థానికతను తెలిపితేనే సార్థకత

- విశ్రాంత ఇంజనీరు శంకర్‌నారాయణ
- మనమెరుగని లాటిన్ అమెరికా ఆవిష్కరణ



ప్రసంగిస్తున్న శంకర్‌నారాయణ


అనంతపురం టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రజల సాంఘిక, సాంస్కృతిక జీవన పరిస్థితులను తెలుసుకునేలా యాత్రలు ఉండాలని బీఎస్ఎన్ఎల్ విశ్రాంత డివిజనల్ ఇంజనీరు శంకర్‌నారాయణ అన్నారు. దాసరి అమరేంద్ర తెలుగులోకి అనువదించిన 'మనమెరుగని లాటిన్ అమెరికా' పుస్తక పరిచయ సభను గురువారం సాయంత్రం ఎన్జీఓ హోంలో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో దాసరి అమరేంద్ర ప్రసంగించారు. స్థానిక సంస్కృతితో సంపర్కం చెందకుండా చేసే యాత్రలు నిష్ఫలమని అన్నారు. డాక్టర్ శేషగిరి లాటిన్ అమెరికా దేశాలలోని ప్రజలతో మమేకమై, అక్కడి సంస్కృతి, జీవన విధానాలను పుస్తకరూపంలోకి తీసుకువచ్చారని అన్నారు. ఆ పుస్తకాన్ని దాసరి అమరేంద్ర 'మనమెరుగని లాటిన్ అమెరికా' పేరుతో ఇక్కడి వారికి అర్థమయ్యేలా తెలుగులో అనువదించడం అభినందనీయమని అన్నారు. ఆయా దేశాల్లో జన సాంస్కృతిక వైరుధ్యాలను అర్థం చేసుకున్న రచయిత ఆలోచనలను ఈ పుస్తకం ప్రతిబింబిస్తుందని అన్నారు. నేటివ్ అమెరికన్లు ఈ దేశాల ప్రజలేనని, వారి ఆచార వ్యవహారాలను, ఆహారపు అలవాట్లను డాక్టర్ శేషగిరి పాఠకులకు పరిచయం చేశారని అన్నారు. అమరేంద్ర అంతే సమర్థవంతంగా తెలుగీకరించారని అభినందించారు. కార్యక్రమంలో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ప్రతినిధి ఏజీ రాజమోహన్, మానవహక్కుల వేదిక నాయకులు ఎస్ఎం బాషా, చంద్రశేఖర్, డాక్టర్ ప్రసూన, రచయితలు రాజారామ్, తరిమెల అమర్నాథరెడ్డి, డాక్టర్ శాంతినారాయణ, ఉప్పరపాటి వెంకటేశులు, జూటూరు షరీఫ్, రియాజుద్దీన్, టీవీ రెడ్డి, సత్యబోస్, గోవిందరాజులు, అనంత మాలతి తదితరులు పాల్గొన్నారు.

గడేకల్లులో గజదొంగలు

- పనులు చేయకుండానే బిల్లులు డ్రా
- రూ.18 లక్షలు స్వాహా
- వైసీపీ, టీడీపీ నాయకుల కుమ్మక్కు
- సోషల్ మీడియాలో వైరల్

విడపనకల్లు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లు గ్రామంలో గజదొంగలు పడ్డారు. ఒక్క పని చేయకుండానే రూ.18 లక్షలు డ్రా చేసుకుని పంచుకుతిన్నారు. ఈ అక్రమాల వ్యవహారం కలకలం రేపుతోంది. సోషల్ మీడియాలో సంచలనమైంది. వారం రోజులుగా హాట్ టాపిక్‌గా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామంలో కొంతమంది టీడీపీ నాయకులు.. వైసీపీ వారితో కుమ్మక్కయ్యారు. నీకు ఇంత.. నాకు ఇంత.. అని పనులు చేయకుండానే బిల్లులు డ్రా చేసుకు తిన్నారంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గడేకల్లు సర్పంచ్ వైసీపీ మద్దతుదారుడు కావడంతో గ్రామం పరిధిలో ఎలాంటి బిల్లు కావాలన్నా... సర్పంచ్ సంతకం తప్పనిసరి. దీంతో టీడీపీ నాయకులు.. వైసీపీ వారితో కుమ్మక్కయ్యారు. పనులు చేయకుండానే బిల్లులు మింగేశారు. విషయం బయటకు పొక్కడంతో కొంతమంది గామానికి చెందిన టీడీపీ నాయకులు కొన్నిరోజుల క్రితం పంచాయతీ రికార్డులను బయటకు తీసి పరిశీలించారు. ఎక్కడెక్కడ పనులు చేశారు, వాటి వివరాలు బిల్లులు సహా బయట పెట్టారు. ఒక్క పని కూడా చేయలేదని తెలిసి గడేకల్లు గ్రామ సచివాలయానికి చేరుకున్నారు. పనులు చేయకుండానే బిల్లులు ఎలా పెట్టారని అధికారులను నిలదీశారు. బిల్లులు పెట్టిన ప్రకారం పనులు ఎక్కడ చేయించారో చూపించాలంటూ అధికారులతో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. గడేకల్లు గ్రామంలో మరుగుదొడ్లు కట్టినట్లు రికార్డులు చేశారు. గ్రామంలో ఎక్కడా అలాంటివి నిర్మించలేదు. అయినా బిల్లులు మాత్రం లక్షల్లోనే డ్రా చేశారు. నిటి శుద్ధికి ఏకంగా రూ.4లక్షలు ఖర్చు చేసినట్లు రికార్డులు చేశారు. ఒక్క పని కూడా చేయలేదని గ్రామస్థులు స్పష్టం చేస్తున్నారు.





12:45

Ukd Politics

14h

విడపనకల్లు మండలం గడేకల్లులో అధికారులు మంజూరు చేసిన బిల్లులలో మచ్చుకు కొన్నింటిని పోస్ట్ చేశాం. పని వివరం, బిల్లు పొందిన వ్యక్తి, డ్రా చేసిన మొత్తాన్ని పరిశీలించండి. మీ గ్రామంలో వీటన్నింటినీ సక్రమంగా చేశారా? లేదా? అన్నది తెలుసుకొని.. గ్రామానికి మేలు చేస్తున్నారా? లేక నిధులు నొక్కుతున్నారా? ఓ అంచనాకు రండి. ఆ తర్వాత మీ తీర్పు రాబోయే స్థానిక ఎన్నికల్లో ఇవ్వండి. మంచి అయితే మంచి, చెడు అయితే చెడు. అంతిమ నిర్ణయం ప్రజలదే.

చెప్పడం మావంతు..!

నిర్ణయం మీ వంతు..!

1 comment

Like Comment Send Share

Water Purification System That Wastes Less Water 92923702

Purpose: Pipe Line Works

Amount: ₹ 4,26,294

e-Payment Order Created (4 mons 13 days ago)

Paid To: THASI UMASANKAR

Bank Account No: *******4401

Payment Proposed by (Sachiv) DSC (4 mons 13 days ago)

IFSC Code: NA

Voucher No./Date: XVEC/

సోషల్ మీడియాలో అక్రమ బిల్లులు

బిల్లులో అలా నమోదు చేసినా..

పంచాయతీలో డబ్బులు తక్కువగా ఉంటే పీఎఫ్ఎంఎస్ నిధులను వినియోగించుకోవచ్చు. బిల్లులో ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణానికి, తాగునీటి కోసం నమోదు చేసినా.. అ నిధులను గ్రామంలో చేసిన ఇతర పనులకు వాడుకోవచ్చు. మరుగుదొడ్డే నిర్మించకపోయినా వాటి నిర్వహణకు అని చెప్పి బిల్లులు డ్రా చేసుకోవచ్చు.

-సత్యబాబు, ఈఓఆర్డీ

డ్రా చేసుకున్న బిల్లులు

- గతేడాది సెప్టెంబరు 6న రూ.97,500
- అక్టోబరు 29న రూ.57,230, రూ.40,270, అక్టోబరు 30న రూ.15,730, నవంబరు 20న రూ.1,96,316
- ఈ ఏడాది జనవరి 28న మేకల భీమేష్ పేరున రూ.1.33 లక్షలు, జనవరి 29న కర్రెన్నగారి రాముడి పేరున మరుగుదొడ్డి నిర్మించినట్లు రూ.78,560, జనవరి 30న కర్రెన్నగారి రాముడి పేరున నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు రూ.24,210, వైసీపీకి చెందిన గడేకల్లు సర్పంచ్ సుశీల భర్త ఉమాశంకర్ పేరున నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటుకు రూ.4.26 లక్షలు
- ఫిబ్రవరి 6న కురుబ రామాంజనేయులు పేరున రూ.48,380
- ఏప్రిల్ 8న ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.1.63 లక్షలు, మొండ్ల శివశంకర్ పేరున డ్రింకింగ్ వాటర్ ప్లాంట్‌కు రూ.97,500, టీడీపీ నాయకుడు ముద్దూరి శ్రీనివాసులు పేరున నాలుగు బిల్లులు పెట్టారు. ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.1,10,035, ఇతర పనులకు రూ.1,82,524, రూ.68,843, రూ.87,313 బిల్లులు డ్రా చేశారు.

53 డ్రంకెన్ డ్రైవ్ కేసుల నమోదు

31 వరకూ స్పెషల్ డ్రైవ్: ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం తాగి వాహనాలు నడపడం, ఆరుబయట మద్యం తాగే వారిని కట్టడి చేయడంపై స్పెషల్ డ్రైవ్ పెట్టినట్లు ఎస్పీ జగదీష్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై స్పెషల్ డ్రైవ్ జరుగుతోందన్నారు. జిల్లావ్యాప్తంగా సీఐలు, ఎస్ఐలు రహదారులపై వాహన తనిఖీలు చేస్తున్నారన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై నిఘా పెట్టామన్నారు. ఆటోలు, టూవీలర్లు, కార్లు, లారీలు, ఇతర వాహనాలను ఆపి బ్రీత్ అనలైజర్లతో తనిఖీలు చేస్తున్నామన్నారు. ఈ డ్రైవ్‌లో భాగంగా ఇప్పటికే డ్రంకెన్ డ్రైవ్‌పై 53, ఓపెన్ డ్రింకింగ్‌పై 93 కేసులు నమోదు చేశామన్నారు. ఈనెల 10 వరకూ డ్రంకెన్ డ్రైవ్, 11 నుంచి 17వ తేదీ వరకూ అతివేగం, 18 నుంచి 24వతేదీ వరకూ హెల్మెట్ వినియోగం, 25 నుంచి 31వతేదీ వరకూ ప్రమాదాలు అధికంగా జరిగే బ్లాక్‌స్పాట్‌ల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు ఎస్పీ జగదీష్ స్పష్టం చేశారు.

13న రామగిరి ఎంపీపీ ఎన్నిక

రామగిరి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రామగిరి మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 13న ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి సంజీవయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఎన్నిక నిర్వహిస్తామన్నారు. ఎంపీపీ స్థానం జనరల్ మహిళకు రిజర్వేషన్ అయింది. ఇప్పటి వరకు మూడుసార్లు ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రస్తుతం నాలుగోసారి నోటిఫికేషన్ విడుదలైంది. ఎంపీపీ ఉప ఎన్నికకు ఎంపీటీసీ సభ్యులందరూ హాజరు కావాలని నోటీసులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

క్రీడలు జీవితంలో భాగం కావాలి

జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు



పతకాలు సాధించిన విద్యార్థులతో జేఎన్‌టీయూ వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

అనంతపురంరూరల్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితంలో క్రీడలు భాగం కావాలని జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు పేర్కొన్నారు. గురువారం జేఎన్‌టీయూ ఆడిటోరియంలో అనుబంధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి జేఎన్‌టీయూ వీసీ, స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్ ఆచార్య సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణయ్య హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతి కళాశాలలో క్రీడాపోటీలు నిర్వహించడానికి అవసరమైన సాయాన్ని విశ్వవిద్యాలయం అందిస్తుందన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో యోగాకు చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. ప్రతి ఫిజికల్ డైరెక్టర్ యోగా నేర్చుకుని, విద్యార్థులకు బోధించాలన్నారు. 2024-25లో 200మంది క్రీడాకారులు సౌత్ జోన్, ఆల్ ఇండియా స్థాయిలో పాల్గొని సర్టిఫికెట్లు పొందడం సంతోషంగా ఉందన్నారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి ఆచార్య నారాయణరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ జోజిరెడ్డి, వ్యాయామ అధ్యాపకులు పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి పోటీలకు 233 మంది ఎంపిక



జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికైన వారు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జోనల్ స్థాయి క్రీడాపోటలకు 233 మంది ఎంపికయ్యారు. ఆగస్టు 29న స్పోర్ట్స్ డేను పురస్కరించుకుని మూడు రోజులుగా జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఆయా క్రీడాంశాల్లో ఎంపికైన వారి వివరాలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్ భాస్కర్ ప్రకటించారు. అండర్-22 విభాగంలో బాల, బాలికలకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించామన్నారు. కబడ్డీ, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, వాలీబాల్, అథ్లెటిక్స్, ఖో-ఖో, ఆర్చరీ, హాకీ విభాగాల్లో జట్లను ఎంపిక చేశారు. వీరు తిరుపతిలో జరిగే జోనల్ స్థాయి పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు 9849421462, 08554-353223 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కేజీబీవీల్లో అడ్మిషన్లు పెంచాలి: డీఈఓ



మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో అడ్మిషన్లు పెంచేలా బోధన ఉండాలని డీఈఓ ప్రసాద్‌బాబు సూచించారు. 9 జిల్లాల కేజీబీవీల్లో పనిచేస్తున్న హిందీ, ఉర్దూ టీచర్లకు ఐదు రోజులుగా స్థానిక శ్రీభారతి బీఈడీ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. చివరిరోజు కార్యక్రమంలో డీఈఓ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. శిక్షణలో తెలుసుకున్న అంశాలను బోధనలో వినియోగించాలన్నారు. విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకోవాలనీ, అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేయాలన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి, నెల్లూరు, కడప, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కేజీబీవీల్లో పనిచేస్తున్న 192 మంది హిందీ, ఉర్దూ టీచర్లు శిక్షణకు హాజరయ్యారని జీసీడీఓ కవిత తెలిపారు. అనంతరం ఆర్‌పీలకు సర్టిఫికెట్లు అందజేశారు.

అన్నదాత ఎదురుచూపు

పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ సొమ్ము జమలో జాప్యం

కొందరికి ఒక్కటే పడిన వైనం

రైతు సేవాకేంద్రాలకు రైతుల పరుగు

రాప్తాడు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ సొమ్ము కోసం జిల్లాలో పలువురు రైతులకు ఎదురుచూపులు తప్పట్లేదు. కొందరికి ఒక పథకం సొమ్ము మాత్రమే జమైంది. మరొక పథకం సొమ్ము పడక ఆందోళన చెందుతున్నారు. దీంతో రైతు సేవాకేంద్రాలకు వెళ్లి, సిబ్బందితో ఆరాతీస్తున్నారు.

ఒక్కటే జమ..

కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద రైతుకు రూ.2వేలు జమ చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రైతు ఖాతాలకు రూ.5 వేలు చొప్పున జమ చేస్తోంది. ఈనెల 2వ తేదీన పథకాలకు శ్రీకారం చుట్టారు. మండలంలో 8,894 మంది రైతులకు రూ.6.22 కోట్లు జమ కావాల్సి ఉంది. కొందరు అర్హులైన రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు పూర్తిస్థాయిలో జమకాలేదు. రూ.2 వేలు ఖాతాలో జమ అయిన వారికి.. రూ.5 వేలు జమ కాలేదు. రూ.5 వేలు జమ అయిన రైతులకు రూ.2 వేలు పడలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేసి 4 రోజులు గడిచింది. అయినా కొందరు రైతులకు పూర్తిగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు జమ కాలేదు. దీంతో రైతు సేవాకేంద్రాల వద్దకు అన్నదాతలు పరుగులు తీస్తున్నారు. డబ్బు ఖాతాలో జమ అవుతుందో.. లేదో.. అని కొందరు ఆవేదన చెందుతున్నారు. 'మీ సమస్యమా బాధ్యత' పేరుతో టీడీపీ నాయకులు గ్రామాల్లో చేపడుతున్న కార్యక్రమాల్లో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ డబ్బు జమకాని రైతులు అర్జీలు అందజేస్తున్నారు.

పీఎం కిసాన్ డబ్బు జమ కాలేదు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 2న అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు విడుదల చేశారు. మా కుటుంబ సభ్యుల్లో ఒకరికి అన్నదాత సుఖీభవ డబ్బు ఖాతాలో జమ అయింది. పీఎం కిసాన్ సొమ్ము రూ.2 వేలు పడలేదు.

-వెంకటరాముడు, రైతు, హంపాపురం

జాబితాలో పేరు ఉందట



ఈనెల 2న అన్నదాత సుఖీభవ డబ్బు రూ.5 వేలు బ్యాంకు ఖాతాలో జమైంది. పీఎం కిసాన్ సొమ్ము రూ.2వేలు పడలేదు. రైతు సేవాకేంద్రం సిబ్బందిని సంప్రదించగా.. అర్హులైన రైతుల జాబితాలో పేరు ఉందని డబ్బు జమవుతుందని తెలిపారు.

-కళావతి, మహిళారైతు, హంపాపురం

అన్నదాత సుఖీభవ డబ్బు పడలేదు



మా కుటుంబ సభ్యుల్లో ఒకరికి పీఎం కిసాన్ డబ్బు రూ.2 వేలు ఈనెల 2వ తేదీ బ్యాంకు ఖాతాలో జమైంది. అన్నదాత సుఖీభవ డబ్బు రూ.5 వేలు పడలేదు. అర్హుల జాబితాలో పేరున్నా.. ఇంకా డబ్బు జమ కాలేదు.

-రామాంజనేయులు, రైతు, హంపాపురం

వారం, పదిరోజుల్లో అందరికీ జమవుతాయి



అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ డబ్బులు ఇప్పటికే చాలామంది రైతుల ఖాతాల్లో జమయ్యాయి. కొందరికి రూ.2వేలు, మరికొందరికి రూ.5వేలు జమ కావాల్సి ఉంది. అర్హులైన రైతులకు తప్పనిసరిగా వారం, పది రోజుల్లో జమవుతాయి.

-కృష్ణచైతన్య, ఏఓ, రాప్తాడు

గర్భిణి ఆత్మహత్య కేసులో వీఆర్వో అరెస్ట్

గుంతకల్లు టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న షేక్ షమీమ్‌బాను కేసులో వీఆర్వో మహమ్మద్‌వలిని వన్‌టౌన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో అరెస్ట్ వివరాలను సీఐ మనోహర్ వెల్లడించారు. పట్టణంలోని సోఫియా స్ట్రీట్‌లో నివాసముంటున్న షేక్ పీర్‌బాషా పెద్ద కుమార్తె షేక్ షమీమ్ బానుకు ఆరేళ్ల కిందట రాయచూర్‌కు చెందిన షామీర్ హుసేన్‌తో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. విభేదాల నేపథ్యంలో భర్తతో విడాకులు తీసుకున్న షమీమ్ బాను తన కొడుకుతో కలిసి తల్లిదండ్రుల వద్దే ఉండేది. 2023లో రేషన్ కార్డులో తన కుమారుడి పేరు చేర్పించడానికి భాగ్యనగర్‌లోని సచివాలయానికి షమీమ్ బాను వెళ్లారు. అక్కడ వీఆర్వోగా పనిచేస్తున్న మహమ్మద్ వలితో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఈక్రమంలో ఆమెకు మాయ మాటలు చెప్పి, 2024లో పెళ్లి చేసుకుని వేరే కాపురం పెట్టాడు. షమీమ్‌బాను వద్ద ఉన్న రెండు లక్షల విలువచేసే బంగారం నగలను కూడా మహమ్మద్ వలి తీసుకుని తాకట్టు పెట్టి, వచ్చిన డబ్బు వాడుకున్నాడు.

షమీమ్‌బానుతో పెళ్లి, వేరు కాపురం విషయం మహమ్మద్ వలి మొదటి భార్య నూర్జహాన్‌కు తెలిసింది. దీంతో ఆమె వెళ్లి షమీమ్‌బానుతో గొడవ పడింది. దీంతో మహమ్మద్ వలి, అతడి మొదటి భార్య నూర్జహాన్, ఆమె కుటుంబ సభ్యులపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో షమీమ్‌బాను కేసు పెట్టింది. తర్వాత కొద్ది రోజులకు తాను గర్భవతిని అని, గోల్డ్‌లోన్ కట్టడానికి కష్టంగా ఉందని, పెట్టిన కేసు వెనక్కి తీసుకుంటానని, తనను కాపురానికి తీసుకొని వెళ్లాలని మహమ్మద్ వలిని బతిమాలింది. అతడు మాత్రం నువ్వంటే నాకు ఇష్టం లేదు, నువ్వు నాకు వద్దు, ఎక్కడైనా చచ్చిపో అంటూ కటువుగా మాట్లాడాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె బుధవారం విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి షేక్ పీర్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మధ్యాహ్నం వీఆర్వో మహమ్మద్ వలిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

బంగారం చోరీ

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ఓ మహిళ బ్యాగ్ నుంచి పది తులాల బంగారం మాయమైంది. అనంతపురం నుంచి కళ్యాణదుర్గం మండలం పరశురాంపురం గ్రామానికి జ్యోతి అనే మహిళ గురువారం బయలుదేరింది. కళ్యాణదుర్గం బస్టాండ్‌లో దిగి, పరశురాంపురం వెళ్లే బస్సు ఎక్కింది. దాహం వేయడంతో వాటర్ బాటిల్ కోసం బ్యాగ్ తీసింది. ఆ సమయంలో బంగారం కనిపించలేదు. చోరీకి గురైనట్లు గుర్తించి, వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కొత్తచెరువు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లోచర్ల గ్రామానికి చెందిన కిత్తెర నారాయణస్వామిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని అప్‌గ్రేడ్ సీఐ మారుతీ శంకర్ గురువారం తెలిపారు. లోచర్లకు చెందిన దామోదర్, లక్ష్మయ్య కిత్తెర నారాయణస్వామి బుధవారం రాత్రి మద్యం సేవించి, గొడవ పడ్డారని తెలిపారు. మద్యం మత్తులో నారాయణస్వామి కులం పేరుతో దూషించారని, తమపై దాడి చేశారని దామోదర్, లక్ష్మయ్య ఫిర్యాదు చేశారని సీఐ తెలిపారు.

కారు అద్దె ఇవ్వలేదని..

కడపకు చెందిన వెంకట శశిధర్ రెడ్డి తన కారును అద్దెకు తీసుకుని మోసగించాడని కొత్తచెరువు మండలం తిప్పాబట్లపల్లికి చెందిన గడపర్తి హరీష్ ఫిర్యాదు చేశారని సీఐ మారుతీ శంకర్ తెలిపారు. ఇన్నోవా కారును నెలకు రూ.27 వేల ప్రకారం అద్దెకు ఇచ్చానని, రూ.3 లక్షల అద్దె ఇవ్వాల్సి ఉందని, కారును కూడా ఇవ్వడం లేదని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో నిందితుడిపై చీటింగ్ కేసు నమోదు చేశామని తెలిపారు.

మెట్లపై నుంచి జారిపడి మృతి

నల్లమాడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎన్. ఎనుములవారిపల్లి గ్రామానికి చెందిన కొట్టాల భాస్కర్(47) తన ఇంటి మెట్లపై నుంచి జారిపడి మృతిచెందాడు. ప్రమాదంపై మృతుని తమ్ముడి కుమారుడు వంశీ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈనెల 3వతేదీ మిద్దెపైకి ఎక్కుతు జారిపడ్డాడని, తీవ్ర గాయాలతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. భాస్కర్‌కు భార్య మహేశ్వరి, కుమారుడు, కూతురు ఉన్నారు.

అసభ్య పోస్టులపై కేసు నమోదు

గాండ్లపెంట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ యువతికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టినవారిపై కేసు నమోదు చేశామని జమేదార్ గంగాధర్ గురువారం తెలిపారు. యువతి ఫొటోను మార్ఫింగ్ చేసి, అసభ్యంగా మార్చి సోషల్ మీడియాలో పెట్టారని ఆయన తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తులుగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడి ఆత్మహత్య

కుటుంబ కలహాలు, అప్పులతోనే..



రామాంజనేయులు (ఫైల్)

పెనుకొండ రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలు, అప్పుల బాధ భరించలేక విషపు గుళికలు మింగిన మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, ముత్యాల చెరువు సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు రామాంజనేయులు (58) చికిత్స పొందుతూ గురువారం మరణించారు. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామాంజనేయులు ఐదెకరాల భూమి కౌలుకు తీసుకుని, అందులో వివిధ పంటలు సాగుచేస్తుండేవాడు. పంటలు దెబ్బతిని నష్టపోయాడు. రూ.50 లక్షల వరకు అప్పులపాలయ్యాడు. దీనికితోడు కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. వీటితో మనస్తాపం చెంది గతనెల 30న విషపు గుళికల మింగాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించారు. అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆత్మహత్యపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. రామాంజనేయులుకు భార్య నాగమ్మ, కుమారుడు మల్లికార్జున ఉన్నారు.

చిత్రావతి సుందరీకరణకు శ్రీకారం

పనులకు జోయాలుక్కాస్ రూ.1.2 కోట్ల విరాళం



చెక్కును అందచేస్తున్న జోయాలుక్కాస్ ప్రతినిధులు

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతిని పురస్కరించుకుని పుట్టపర్తిలో చిత్రావతి నది సుందరీకరణ పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. ట్రస్టు సభ్యుడు ఆర్‌జె రత్నాకర్, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, జేసీ అభిషేక్‌కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పనులకు ప్రారంభోత్సవం చేశారు. జోయాలుక్కాస్ సంస్థ విరాళంగా అందించిన రూ.1.2కోట్లతో ఈ పనులు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యసాయి శతజయంతి ఉత్సవాల నిర్వాహణకు జోయాలుక్కాస్ సంస్థ భారీ విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈనిధులతో చిత్రావతి నది తీర ప్రాంతంలో పార్కు, జిమ్, ప్రహరీలు నిర్మిస్తామన్నారు. జేసీ మాట్లాడుతూ.. సత్యసాయి బాబా శతజయంతిని ఘనంగా నిర్వహించడానికి పుట్టపర్తిలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. జోయాలుక్కాస్ సంస్థ బాటలో మిగిలిన వారు కూడా సుందరీకరణ పనులకు విరాళాలు అందించాలని కోరారు. మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ చిత్రావతి ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు జోయాలుక్కాస్ సంస్థ ప్రతినిధులు మ్యాంగ్‌ధ్యూ, గణేష్, రూ.1.2 కోట్ల చెక్కును సత్యసాయిబాబా సెంట్రల్ ట్రస్టు ప్రతినిధులు, ఎమ్మెల్యే, జేసీ, మాజీ మంత్రికి అందించారు. కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, ఇరిగేషన్ ఏఈ సుధాకర్‌రాజు, ఏఈ జానకీబాయి, టీడీపీ నాయకులు పీసీ గంగన్న, సామకోటి ఆదినారాయణ, గంగాధర్‌నాయుడు పాల్గొన్నారు.

గంటల్లోనే చోరీ కేసు ఛేదింపు

ఇద్దరు నిందితుల అరెస్టు

రూ.3.3 లక్షలు, 5.8 తులాల బంగారం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం చూపిస్తున్న డీఎస్పీ వెంకటేశులు, సీఐ

బుక్కరాయసముద్రం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చోరీ జరిగిన 24 గంటల్లోనే కేసును ఛేదించి, ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. బుక్కరాయసముద్రం చేపలకాలనీకి చెందిన ఒంటరి మహిళ పాముల తిప్పక్క అనంతపురం మార్కెట్‌లో ఆకుకూరలు విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. ఈక్రమంలోనే బుధవారం వేకువజామునే మార్కెట్‌కు వెళ్లింది. దీన్ని గుర్తించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో ఉన్న రూ.3.3లక్షలు, 5.8తులాల బంగారం ఆభరణాలు చోరీ చేశారు. మార్కెట్ నుంచి వచ్చిన తిప్పక్కకు ఇంట్లో బీరువా పగులగొట్టి ఉండటం కనిపించింది. బీరువాలో ఉన్న నగదు, బంగారం పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన చెల్లెలు కుమారులు ఇంద్రసేనారెడ్డి, శశికుమార్‌రెడ్డిపై అనుమానం వ్యక్తం చేసింది. స్థానిక ముసలమ్మ గుడి సమీపంలో ఉన్న వారిద్దరిని పట్టుకుని సీఐ పుల్లయ్య, ఎస్ఐ రామప్రసాద్, పీఎస్ఐ కళ్యాణ్, పోలీసు సిబ్బంది తమదైన శైలిలో విచారించారు. నేరం అంగీకరించడంతో వారి వద్ద ఉన్న రూ.3.3లక్షలు, 5.8 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. చోరీ కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

గుంతకల్లు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డివిజన్ మీదుగా వెళ్లే పలు రైళ్లకు వెయిటింగ్ లిస్టు ప్రయాణికుల సౌకర్యార్థం శాశ్వత ప్రాతిపదికన అదనపు కోచ్‌లను జత చేయనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం -ధర్మవరం (వయా తాడిపత్రి, గుత్తి, అనంతపురం) ఎక్స్‌ప్రెస్ (17215) రైలుకు ఈ నెల 10 నుంచి, దీని తిరుగు ప్రయాణపు రైలు (17216)కు ఈ నెల 11 నుంచి ఒక ఏసీ టూటైర్ కోచ్‌ను జత చేయనున్నట్లు తెలిపారు. తిరుపతి-హుబ్లీ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (57401) రైలుకు ఈనెల 13 నుంచి, దీని తిరుగు ప్రయాణపు రైలు (57402)కు ఈ నెల 14 నుంచి, తిరుపతి-గుంతకల్లు ప్యాసింజరు (57403) రైలుకు ఈనెల 13 నుంచి, దీని తిరుగు ప్రయాణపు రైలుకు (57404) ఈనెల 14 నుంచి, తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరు (57405) రైలుకు ఈ నెల 15 నుంచిచీ, దీని తిరుగు ప్రయాణపు రైలు (57406)కు ఈ నెల 16 నుంచి రెండు స్లీపర్‌క్లాస్ కోచ్‌లను శాశ్వత ప్రాతిపదికన జోడించి నడపనున్నట్లు వెల్లడించారు.

ప్రతి బస్సును కండిషన్‌లో ఉంచాలి

సిబ్బందికి ఆర్టీసీ ఈడీ ఆదేశాలు



అనంతపురం డిపో గ్యారేజీలో పరిశీలిస్తున్న ఈడీ చంద్రశేఖర్

అనంతపురం టౌన్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): రీజియన్‌లో ప్రతి బస్సును కండిషన్‌లో ఉంచాలని ఆర్టీసీ ఈడీ చంద్రశేఖర్.. సిబ్బందికి సూచించారు. గురువారం అనంతపురం డిపోతోపాటు బస్టాండు పరిసరాలను ఆయన పరిశీలించారు. బస్సుల సామర్థ్యం, గ్యారేజీలో చేపడుతున్న పనులపై అధికారులతో ఆరాతీశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం కోసం బస్సుల వినియోగం ఎక్కువగా ఉంటుందనానరు. ఆ మేరకు సరిపడా బస్సులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. టిమ్‌లు, స్పేర్ పార్ట్స్ అవసరమైనన్ని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. బస్టాండు పరిసరాలు, కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతపురం డిపో కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణం కోసం రూపొందించిన నమూనాను అధికారులు.. ఈడీకి చూపించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అనంతపురం ఇన్‌చార్జి ఆర్‌ఎం శ్రీలక్ష్మి, డిప్యూటీ సీఎంఈ చంద్రాయుడు, డీఎం నాగభూపాల్, బస్టాండు మేనేజర్ కేవీఎన్ మూర్తి, సూపర్‌వైజర్లు, ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జీపీగా తిరుపతినాయుడు



అనంతపురం క్రైం, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): జిల్లా గవర్నమెంట్ ప్లీడర్‌గా అడ్వకేట్ తిరుపతినాయుడు నియమితుడయ్యారు. ఈ మేరకు గురువారం జీవో 274 జారీ అయింది. నార్పల మండలం వెంకటంపల్లికి చెందిన తిరుపతి నాయుడు 1989లో బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ చేసుకున్నారు. 1996 నుంచి 1998 వరకూ ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్‌గా వ్యవహించారు. 2002 నుంచి 2006 వరకూ అనంతపురం జిల్లా 6వ అదనపు కోర్టులో అడిషనల్ పీపీగా పనిచేశారు. ఫ్యామిలీ కోర్టు (7వ అదనపు జిల్లా కోర్టు) అడిషనల్ పీపీగా 2016 నుంచి 2019 వరకూ ఒకసారి, 2019 నుంచి రెండోసారి పనిచేశారు. జీపీగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి మూడేళ్ల పాటు ఆయన ఆ పోస్టులో కొనసాగుతారు. ప్రభుత్వం తరఫున ఆయన సివిల్ కేసులు చూస్తారు. జీపీగా సేవలు అందించేందుకు ప్రభుత్వం ఆయనకు నెలకు రూ.30 వేలు గౌరవ వేతనం అందిస్తుంది. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరిస్తారని తెలిసింది.

న్యూస్ బాక్స్

త్రివర్ణ పతాకంతో ర్యాలీ



త్రివర్ణ పతాకంతో ర్యాలీ చేస్తున్న మండల సమాఖ్య సభ్యులు

అమడగూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎస్సీకాలనీలో గురువారం వెలుగు సంఘాల అమృత మండల సమాఖ్య ఆధ్వర్యంలో త్రివర్ణపతాక ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమం ఆగస్టు 15 వరకు కొనసాగుతూ, మండలంలోని అన్ని పంచాయతీల్లో డీఆర్‌డీఏ వెలుగు సిబ్బందితో కలిసి నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు హరి, వెంకటరమణ, శంకర్‌నాయక్, రామాంజనప్ప, సమాఖ్య లీడర్లు మునిరత్నమ్మ, సభ్యులున్నారు.

మార్కెట్‌యార్డు కమిటీ నియామకం



వైస్ చైర్మన్ కొమ్మినేని గంగయ్య

కదిరి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్‌గా కొమ్మినేని గంగయ్యను నియమించారు. కదిరి మార్కెట్‌యార్డు చైర్మన్‌గా ఇప్పటికూ ఎం. అనసూయను నియమించారు. తాజాగా వైస్ చైర్మన్ గంగయ్యతో పాటు మరో 13మందిని సభ్యులుగా ఎంపిక చేశారు. సభ్యులుగా వెంకటరమణ, సంధ్య, రాజమ్మ, రమాదేవి, తస్లీమ్, రేవతి, సమీవుల్లా, హరిప్రసాద్, లక్ష్మీదేవి, కుమారి, చిన్నరామయ్య, రామతులసమ్మ, సుదర్శన్‌రెడ్డిను ఎంపిక చేశారు. అన్ని సామాజిక వర్గాలకు ఇందులో స్థానం కల్పించారు. తనను వైస్ చైర్మన్‌గా ఎంపిక చేసిన పార్టీ పెద్దలకు, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు కొమ్మినేని గంగయ్య కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీ యూనియన్ కార్యవర్గం ఎంపిక



అధ్యక్ష, కార్యదర్శులు మణిమాల, రంగమ్మ

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీల యూనియన్ స్థానిక ప్రాజెక్టు కార్యవర్గాన్ని గురువారం సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ప్రాజెక్టు అధ్యక్షురాలిగా డబురువారిపల్లి మణిమాల, ప్రధాన కార్యదర్శి రంగమ్మతోపాటు మినీ వర్కర్ల యూనియన్ లీడర్‌గా భారతి, ఆయాల యూనియన్ లీడర్‌గా నిరీషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంగన్‌వాడీ సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాడి సాధించేందుకు కృషి చేస్తామన్నారు. యూనియన్‌నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

స్వామినాథన్‌కు రైతు సంఘం నివాళి



స్వామినాథన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ధర్మవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): హరిత విప్లవ పితామహుడు డాక్టర్ స్వామినాథన్ శత జయంతి వేడుకలను రైతుసంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. రైతుసంఘం కార్యాలయంలో స్వామినాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా ప్రధానకార్యదర్శిజంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ... దేశ ఆహారభద్రతకు కీలకమైన వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేసిన వారిలో ప్రొఫెసర్ స్వామినాథన్ ఒకరన్నారు. .ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మారుతి, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్‌హెచ్‌బాషా, సీఐటీయూ నాయకులు జేవీ రమణ, అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, చేనేత నాయకులు గుంపుహటి, ఖాదర్‌బాషా, వెంకటస్వామి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నుజ్జునుజ్జు అయిన బొలెరో వాహనం

నల్లచెరువు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సంత తోపు వద్ద గురువారం గ్యాస్ లారీని బొలెరో వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. మదనపల్లి వైపు నుంచి బొలేరో వాహనం గ్యాస్ ఫుల్ సిలిండర్లతో కదిరి వైపు వస్తోంది. తనకల్లుకు వెళ్తున్న లారీని నల్లచెరువు సంత తోపు వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌బళ్లాపూర్ దిబ్బరహళ్లికి చెందిన బొలేరో వాహనం డ్రైవర్ బీఎన్. వెంకటకుమార్ (30) అక్కడిక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో సీఆర్‌ఎంటీ మృతి



బాబావలి (ఫైల్)

కొత్తచెరువు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో సీఆర్‌ఎంటీగా పనిచేస్తున్న బాబావలి(48) గురువారం గుండెపోటుతో మృతిచెందారు. కొత్తదేవరపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు భార్య హమీనా, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ఎస్ఎస్ఏ ఏపీసీ దేవరాజ్, ఎంఈఓ సోమశేఖర్‌నాయుడు పరామర్శించారు. ఆ కుటుంబానికి తక్షణ సాయం కింద రూ. 15వేలు అందజేశారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని వారు హామీ ఇచ్చారు. వారి వెంట ఎంఈఓ-2 జయచంద్ర, ఏపీఓ ఆర్‌చంద్ర, ఎల్ చంద్రమోహన్, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

పరిష్కారం కాని విద్యుత్ సమస్యలు

● అప్రకటిత కోతలతో ప్రజలకు ఇక్కట్లు
● కంచె లేకుండా ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు
● కొన్నేళ్లుగా ఇన్‌చార్జ్‌ల పాలన



నల్లచెరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వద్ద కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

నల్లచెరువు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అప్రకటిత విద్యుత్ కోతలతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గ్రామాల్లో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. దోమలతో చిన్నారులు, వృద్ధులు వ్యాధి బారిన పడుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కోతలపై అధికారులను ప్రశ్నించినా, వారు పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. చిన్నపాటి వర్షం పడినా వేళపాళ లేకుండా రాత్రి సమ యంలో అప్రకటితంగా ఎప్పుడు బడితే అప్పుడు విద్యుత్ కోతలు విధిస్తున్నారు. కొన్ని హెల్ప్‌లైన్ నంబర్లు ఉన్నా, అవి పనిచేయడంలేదు. విద్యుత్ కోతలతో ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం ప్రజలకు సేవలు అందడంలేదు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

మండలంలోని పలు గ్రామాల్లో పాఠశాలల వద్ద విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు కంచెలు లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్నిచోట్ల ట్రాన్స్‌పార్మర్ల వైర్లకు కంపచెట్లు, తీగలు అల్లుకోవడంతో అర్తు అవుతున్నాయి. గాలి వీచి, వర్షం కురిసినప్పుడు ట్రాన్స్‌పార్మర్ల వద్ద నిప్పురవ్వలు వస్తుండడంతో ఆయా గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. అధికారులకు సమస్యను తెలిపినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని గ్రామా ల్లోని ఇళ్లలో అయితే నోటల్ వైర్‌కు విద్యుత్ సరఫరా అవుతోంది. దీంతో పలువురు ప్రమాదాల పడిన సంఘటనలు ఉన్నాయి. అలాగే పలు గ్రామాల్లో ట్రాన్స్‌పార్మర్లు రోడ్డు పక్కనే ఉ న్నాయి. వాటికి కంచె వేయలేదు. ఇలా మండల కేంద్రంలోని పూలకుంట రోడ్డులో ఉన్న ట్రాన్స్‌పార్మర్‌ను గత యేడాది ఓ వ్యక్తి తగిలి, విద్యుదా ఘాతానికి అక్కడిక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. అప్పటికప్పు డు అధికారులు స్పందించి ఆ ఒక్క ట్రాన్స్‌పార్మర్‌కు మాత్రమే కంచె ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. ప్రాణం పోతే తప్ప అధికారులు స్పందించడం లేదని ప్రజలంటున్నారు. అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు.



విద్యుత్ వైర్లపై ఉన్న చెట్టు కొమ్మలు

కొన్నేళ్లుగా ఇన్‌చార్జ్‌ల పాలనే

మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొన్నేళ్లుగా రెగ్యులర్ విద్యుత్ అధికారులు లేరు. ఇన్‌చార్జ్‌లతోనే కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో విద్యుత్ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడంలేదని రైతులు, ప్రజలు మండిపడుతున్నారు. కిందిస్థాయి ఉద్యోగులేమో ఈ విషయంలో తామేమీ చేయలేమంటున్నారు. ప్రతి సమస్యను డీఈ దృష్టికి తీసుకెళతామంటు న్నారు. ఇన్‌చార్జ్ ఏఈలు ఎక్కడ ఉంటారో తెలియదు. ఫోన్లకు అందుబాటులోకి రాకపోవడంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొత్తగా బోరు వేసుకున్న రైతులు ట్రాన్స్ పార్మర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలంటే, ఏఈ లాగిన్‌లోనే అవకాశం. ఏఈ అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎలాగోలా అవస్థలు పడి దరఖాస్తు చేసుకున్న రైతులకు సకాలంలో ట్రాన్స్‌పార్మర్లు అందడం లేదు. దీంతో బోర్లు వేసుకుని సంవత్సరపైగా పడుతుండడంతో రైతులు పంటలు పండించుకోవడానికి వీలు లేకుండా పోతోంది. త్వరగా రెగ్యులర్ ఏఈని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియదు



చిన్నపాటి వర్షం పడి నిలిచిపోయినా విద్యుత్ అంతరాయం ఎక్కువగా ఉంది. రాత్రి సమయంలో చిన్నారులు, వృద్ధులు, ఉక్కపోతతో, దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. హెల్ప్‌లైన్ నంబర్లు ఇచ్చినా, సకాలంలో స్పందించకపోవడం బాధకరం. సమయపాలన పాటించకుండా రైతులకు వేళపాళ లేని విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడంలేదు.

\- వర్ల భరత్, పూలకుంట గ్రామం

గాలుల వల్ల విద్యుత్ కోత

ప్రస్తుతం వర్షాలతో పాటు గాలులు అధికంగా వస్తుండడంతో విద్యుత్ కోతలు ఉన్నాయి. మా దృష్టికి వచ్చిన సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. రాత్రిళ్లు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటున్నాం.

\- జనార్దన్, లైన్‌మన్

అంగన్‌వాడీల సమస్యలపై ఉద్యమాలు తప్పవు

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు



సమావేశంలో మాట్లాడుతున్న ఓబులు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు తప్పవని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పేర్కొన్నారు. ఆయన గురువారం మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్‌లో అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్మిక చట్టాల సవరణను వ్యతిరేకిస్తూ, దేశవ్యాప్తంగా గతనెల 9న సర్వత్రిక సమ్మె చేపట్టామన్నారు. అనేక నిరసనలు చేపట్టామన్నారు. అంగన్‌వాడీ కార్మికులకు గ్రాట్యుటీ, పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెన్ఫిట్స్‌తో పాటు ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. మినీ వర్కర్లకు మెయిన్ వర్కరులుగా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంతోపాటు అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి దశలవారీ ఉద్యమాలు చేపడతామన్నారు. ఆయనతో పాటు సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, అంగన్‌వాడీ కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, సీఐటీయూ మండల కార్యదర్శి కుళ్లాయప్ప, నాయకులు ఆశీర్వాద మ్మ, క్రిష్టమ్మ, స్వర్ణ, షమీమ్, సరళ, సునీతబాయి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కదిరి అర్బన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సత్యసాయి నీటి పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. వారు గురువారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నీటి సరఫరా పథకం కార్మికుల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ... నీటి సరఫరా పథకం ద్వారా 540మంది కార్మికులు దాదాపు వెయ్యి గ్రామాలకు నీరు అందిస్తున్నారని పేర్కొన్నారు. వారికి నాలుగనెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. వారి సమస్య పరిష్కారం కోసం ఈ నెల 11నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు జీఎల్ నరసింహులు, వెంకటేష్, శీను, రామమోహన్‌రెడ్డి, రామక్రిష్ణ, చంద్రమోహన్, ఉత్తప్ప, కార్మికులు పాల్గొన్నారు.

11 నుంచి సమ్మెలోకి..

బత్తలపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈ నెల 11 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు సత్యసాయి నీటి పథకం కార్మికులు తెలిపారు. ఈ మేరకు వారు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం లో ఏఓ శ్రీనివాసులకు గురువారం వినతిపత్రం ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న సత్యసాయి నీటి పథకం కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు అందడంలేదన్నారు. జీతాలు అందక పోతే కుటుంబ పోషణకు ఇబ్బందిగా ఉందన్నారు. 14 రోజులు ముందుగానే సమ్మె నో టీసు ఇచ్చినా అధికారులు స్పందించడం లేదని అవేదన వ్యక్తం చేశారు. సత్యసాయి నీటి పథకం నిర్వహణకు అయే బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమములో కార్మికులు జగన్, మారుతి, రవీంద్ర, బాషా, రఘుపతి, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

చేనేత చట్టాన్ని అమలు చేయాలి

● చేనేత దినోత్సవంలో నాయకులు



నేతన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న చేనేత నాయకులు

ధర్మవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేనేత 11 రకాల చట్టాన్ని పక్కాగా అమలుచేయాలని ఏపీ చేతివృత్తుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్‌చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం కదిరిగేటు వద్ద గల నేతన్న విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ...చేనేత చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల తీరువల్ల చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయి, చివరికి కార్మికులు ఉపాధి లేకపోవడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని, ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాడ్‌చేశారు. నేతన్న నేస్తం రూ. 24 వేల నుంచి రూ. 36వేలకు పెంచి, సొంత మగ్గం ఉన్న వారికి, అద్దె మగ్గాలు నేసే వారికి, చేతివృత్తులవారికి వర్తింపచేయాలని డిమాండ్‌చేశారు. అనంతరం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు చేనేతల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. చేనేత కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, సీపీఐ నాయకులు రమణ, చేనేత నాయకులు చెన్నంపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.



నల్లచెరువులో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

● నల్లచెరువు: మండలకేంద్రంలోని వీవర్సుకాలనీలోని చేనేత కార్మికులు గురువారం జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా చేనేత ఉపాధ్యక్షుడు జింకా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్మికులు వేణుగోపాల్, నరేష్, చలమయ్య, మల్లికార్జున రామాంజనేయులు, రెడెప్ప తదితరులు ఉన్నారు.

అనుమతులు లేని బోరును సీజ్ చేయండి: సర్పంచ్

అమడగూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురానికి తాగునీటి కోసం ఏర్పా టు చేసిన బోరు బావికి పది అడగుల దూరంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఓ వ్యక్తి వేసిన బోరును సీజ్ చేయాలని తహసీల్దార్ రామనాథ్‌రెడ్డికి ఆ గ్రామ సర్పంచ్ నరసమ్మ గురువారం వినతిపత్రం అందించారు. వర్షాలు సకాలంలో కురవక నీటిమట్టం తగ్గిందన్నారు. పక్కనే ఉన్న బోర్లకు నీరు వెళ్లి పంచాయతీ బోరులో రాకపోతే ప్రజలు ఇబ్బందులు పడతారని సర్పంచ్ తెలిపారు. స్పందించిన తహసీల్దార్ పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



కదిరిలో ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ రాధిక

కదిరి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తల్లిపాల వారోత్సవాలు గురు వారంతో ముగిశాయి. పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాల యంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ రాధిక మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని, ముర్రు పాలు బిడ్డకు మొదటి టీకా అన్నారు. బిడ్డ ఆరునెలల వయస్సు వరకు తల్లిపాలు తాగించాలన్నారు. రెండేళ్ల వరకు అదనపు ఆహారంతో తల్లిపాలు ఇవ్వాలన్నారు. బిడ్డలకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. సూపర్‌వైజర్లు నిహారి, లక్ష్మీదేవి, దీపకళావతి, జయశ్రీ, నరసమ్మ, మమత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● గాండ్లపెంట: మండలంలోని సోమయాజులపల్లి పంచాయ తీ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ పద్మావతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు

● తనకల్లు: తల్లి పాలు బిడ్డకు అమృతమని ఐసీడీఎస్ సూ పర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల ము గింపు సందర్భంగా మండలంలోని టి.సదుం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మురళీధర్ రావు, మహిళ పోలీస్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

భూసేకరణను వేగవంతం చేయండి

● కలెక్టర్ చేతన్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, జేసీ

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం భూసేకరణను వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోలార్ పవర్ ప్రాజెక్టులకు భూసేకరణ అంశంపై గురువారం ఆయన జేసీ అభిషేక్‌కుమార్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణ ప్రక్రియలో భాగంగా సంబంధిత గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, ప్రజల అభిప్రాయం పొందిన తరువాత సమగ్ర నివేదికను సమర్పించాలన్నారు. ఎటువంటి లోటుపాట్లు తలెత్తకుండా పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖాధికారులతోపాటు నెట్‌క్యాంప్, వివిధ సోలార్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం'

తాడిమర్రి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ మండల కన్వీనర్ కూచిరామ్మోహన్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం తాడిమర్రిలో 'మీ సమస్య-మా బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు హర్ష, విశ్వనాథ్, సాయి, రామ్మోహన్‌రెడ్డి, పక్కీర్‌రెడ్డి, రంగయ్య, భాస్కర్‌గౌడ్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

నల్లమాడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సహకార సంఘం సింగల్ విండో చైర్మన్ బడా రమణారెడ్డి శుక్రవారం ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి హాజరుకానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్ గురువారం ఓప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటలకు సహకారం సంఘం ఆవరణంలో ప్రమాణ స్వీకరముంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

16 నుంచి కృష్ణాష్టమి వేడుకలు

ముదిగుబ్బ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు స్థానిక బస్టాండ్ కూడలిలో వైభవంగా నిర్వహిస్తున్నట్లు ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక సభ్యులు తెలిపారు. వారు గురువారం మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో సంబంధిత కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రబోధ సేవాసమితి సభ్యులు విశ్వమూర్తి, రత్నమాచారి, సురేష్ చౌదరి, రామాంజినేయులు, మునలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నియామకాలను పారదర్శకంగా చేపట్టాలి

● ఏపీసీకి ఎస్టీయూ నాయకుల వినతి



ఏపీసీ దేవరాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

కొత్తచెరువు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో చేపడుతున్న నియామకాలను పారదర్శకంగా చేపట్టాలని ఎస్టీయూ నాయకులు కోరారు. వారు గురువారం బుక్కపట్నంలోని ఎస్ఎస్ఏ కార్యాలయంలో ఏపీసీ దేవరాజ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ... సర్వశిక్ష అభియాన్‌లో ఖాళీగా ఉన్న కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్, ఐఈయూ కో ఆర్డినేటర్, అలెస్కో, ఎంఐఎస్ ప్లానింగ్ కో ఆర్డినేటర్, అసిస్టెంట్ ఐఈడీ కో ఆర్డినేటర్, ఏఏ ఎంఓ, ఏఎస్ఓ, ఏపీఓ, ఏపీసీడీఓ తదితర స్థానాలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ పోస్టులను అర్హులైన అభ్యర్థులకు ఇవ్వాలని వారు వినతిపత్రంలో కోరారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు, ప్రలోభాలకు తలొగ్గకుండా న్యాయబద్ధంగా నియామకాలను చేపట్టాలని ఏపీసీని కోరారు. అలాగే గత ఏడాది నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ జ్ఞాన జ్యోతి తరల్ శిక్షణ తరగతులకు రెమ్యునేషన్ తక్షణమే చెల్లించాలని వారు డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు జవహర్, సాంబశివారెడ్డి, ఖాసింసాబ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే వస్తువులు విక్రయించాలి : డీఎం

కదిరి అర్బన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ఎమ్మార్పీ ధరలకే వస్తువులు విక్రయించాలని డిపో మేనేజర్ మైనోద్దీన్ తెలిపారు. ఆయన గురువారం డిపో కార్యాలయంలో దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ప్రయాణికుల నుంచి ధరలు, వస్తువుల నాణ్యతపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్న వారి లైసెన్సు రద్దుచేస్తామన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది నాగసుబ్బయ్య, రియాజుల్లా, శ్రీనివాసలు, దుకాణదారులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ఆర్థిక సాయం

కదిరి అర్బన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌బాల్ క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారిణి షక్కీలాకు కదిరికి చెందిన వ్యాపారవేత్త శ్రీరాములయాదవ్ రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈ మొత్తాన్ని గురువారం ఆ క్రీడాకారిణికి ఓ ప్రైవేటు పాఠశాలలో అందించారు. షక్కీలా యోగా ఉపాధ్యాయు రాలిగా బాధ్యతలు నిర్వహిస్తూ క్రీడల్లో రాణించడం అభినంద నీయమన్నారు. తన వంతుగా ప్రోత్సహక నగదు అందించానని తెలిపారు.

బురదమయమైన రహదారి



రహదారిపై నిలిచిన వర్షం నీరు

ముదిగుబ్బ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ పక్క వీధి లోని దారి వర్షపు నీరు నిలిచి దుర్భరంగా మారింది. బురదమయం అయింది. నడిచి వెళ్లేందుకు కూడా ఇబ్బందికరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. నీటి నిల్వ వల్ల దోమలు పెరిగి వ్యాధులు సోకే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారి వెంట రోజూ వందలాది మంది వెళుతుంటారని తెలిపారు. పంచాయతీ అధికారులు స్పందించి వర్షపు నీటిని తొలగించాలని, దోమలు ఉత్పత్తి కాకుండా బ్లీచింగ్ పొడి చల్లాలని స్థానికులు కోరుతున్నారు.

వినాయక విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పరిగి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో గురువారం నూతనంగా నిర్మించిన గణపతి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా అర్చకుల హోమాలు నిర్వహించి కలశ పూజ నిర్వహించారు. విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డప్ప, డిప్యూటీ ఎంపీడీఓ విజయభాస్కర్, పంచాయతీ కార్యదర్శులు తిప్పన్న, అరుణ, ఆదినారాయణ, ఆనంద్ పాల్గొన్నారు.

క్రీడలు విద్యార్థులకు అవసరం: సీఐ



విజేతలతో సీఐ నాగేష్ బాబు

మడకశిర టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలంటే క్రీడలు చాలా ముఖ్యమని సీఐ నాగేష్ బాబు సూచించారు. గురువారం మడకశిర జూనియర్ కళాశాల మైదానంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ టోర్నీ జరిగింది. మండల పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులు టోర్నీలో పాల్గొన్నారు. టోర్నీలో బాలురకు సంబంధించి సిద్ధార్థ ఇంగ్లీమీడియం స్కూల్ జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా మడకశిర ఉన్నత పాఠశాల జట్టు, బాలికల పోటీలో సిద్ధార్థ ఇంగ్లీమీడియం జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా మడకశిర బాలికోన్నత పాఠశాల జట్టు నిలిచింది. విజేతలకు సీఐ షీల్డ్, మొమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు డాక్టర్ రవిశంకర్, నాగేంద్ర, టీడీపీ పట్టణ అధ్యక్షులు నాగరాజు, మంజునాథ్, నవీద్ పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

- మైనార్టీ నాయకులు



మాట్లాడుతున్న ముస్లిం నాయకులు

హిందూపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని మైనార్టీ నాయకులు అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర హజ్‌కమిటీ సభ్యులు డైమండ్‌బాబా, మున్సిపల్ చైర్మన్ రమేష్, అజ్మతుల్లా, ఇందాద్ మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు హజ్‌యాత్రకు వెళ్లే హాజీలకు రూ.లక్ష ఇస్తామని చెప్పి వారి ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి నారాలోకేష్, బాలకృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫాజిల్, అల్లాబకష్, అన్వర్, ముస్తఫ తదితరులు పాల్గొన్నారు.

పురంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

హిందూపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం హర్‌ఘర్ తిరంగ ర్యాలీని నిర్వహించారు. మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, సిబ్బంది జాతీయ జెండాతో ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున జాతీయ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ఈనెల 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశ సమైఖ్య, సమగ్రతను చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారి గుంగులయ్య, ఏపీఎం రామాంజనేయులు, సీఓలు తౌసిఫ్, నాగేంద్ర, సదానంద, వరలక్ష్మీ, గంగరత్న, ఇబ్రహీం పాల్గొన్నారు.

వినతులకు పరిష్కారం చూపాలి

ఎమ్మెల్యే పీఏ వీరయ్య

చిలమత్తూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వస్తున్న వినతులకు అధికారులు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్య సూచించారు. గురువారం పలగలపల్లి గ్రామంలో పల్లె నిద్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినతులను ప్రజల నుంచి స్వీకరించారు. వాటిపై ఆయన అధికారులతో చర్చించారు. వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణమూర్తి, ఆర్ఐ నేలకోటప్ప, టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

హిందూపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో గల అనధికార లేఅవుట్లో ఉన్న ప్లాట్లు యజమానులు క్రమబద్ధీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ స్కీం కింద గతంలో జారీచేసిన జీఓను సవరిస్తూ జీఓ134ను తీసుకొచ్చిందన్నారు. దీనిద్వారా అనధికార లేఅవుట్లలో ఉన్న ప్లాట్లను క్రమబద్ధీకరణచేసుకునే అవకాశం కల్పించిందన్నారు. ఈ ఏడాది జూన్30లోపు రిజిష్టర్ అయి ఉండాలన్నారు. వివరాలకు మున్సిపల్ కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగాన్ని సంప్రదించాలన్నారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నీ

మడకశిర టౌన్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): మడకశిర జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం నుంచి మూడురోజులపాటు లెదర్‌బాల్ క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు అభిమన్యు స్పోర్ట్స్ అండ్ కల్చరల్ యూత్ అసోసియేషన్ ఆర్గనైజర్ కార్యదర్శి నాగేంద్ర తెలిపారు. ఆగస్టు 15వ తేదీన ఫైనల్ మ్యాచ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. విజేతలకు రూ.15వేలు, రన్నరప్ జట్టుకు రూ.10వేలు అందించనున్నట్లు తెలిపారు.

అర్చకుడి మృతికి నివాళి

అమరాపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వలస గ్రామంలో వలస మారెమ్మ దేవాలయ ప్రధాన అర్చకులు హనుమంతప్ప అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి గ్రామానికి చేరుకుని నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్, మండల కన్వీనర్ కృష్ణమూర్తి ఉన్నారు.

వాకింగ్ ట్రాక్ నిధులు స్వాహా

రూ.94 లక్షలతో అప్పటి ఎమ్మెల్యే భూమిపూజ

అరకొరగా పనులు.. నెరవేరని వాకర్ల కల



చెరువు వద్ద అరకొరగా చేసిన పనులు

పెనుకొండ టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన వాకింగ్ ట్రాక్ జాడలేదు. రూ.లక్షల్లో నిధులు మాత్రం స్వాహా అయ్యాయన్న ఆరోపణలు ఉన్నాయి. పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని భోగసముద్రం చెరువువద్ద వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి. అయితే నిధులు స్వాహా అయ్యాయే తప్ప.. వాకింగ్ ట్రాక్ జాడమాత్రం లేదని వాకర్లు అంటున్నారు.

రూ.94లక్షలతో వాకింగ్ ట్రాక్‌కు శ్రీకారం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా రూ.94లక్షలు అమృత్-2.0 కింద, ఏపీజీ బీసీ కింద చెరువుల సమీపంలో వాకింగ్ ట్రాక్‌లకు శ్రీకారం చుట్టారు. అప్పటి ఎమ్మెల్యే శంకర్‌నారాయణ 2023 సెప్టెంబరులో భూమి పూజచేసి పనులు ప్రారంభించారు. అయితే ఇంతవరకు వాకింగ్ ట్రాక్‌లో ప్రజలు వాకింగ్ చేసిన పాపానపోలేదుకానీ నిధులు మాత్రం నాయకులు, కాంట్రాక్టర్ల జేబుల్లోకి వెళ్లాయని విమర్శలున్నాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు

పెనుకొండ భోగసముద్రం చెరువు అభివృద్ధిలో భాగంగా చెరువుకట్టపై చదునుచేసి 300మీటర్లు చెరువులోపల భాగంలో మరో 300మీటర్లు సీసీ రోడ్లు వేసి రోడ్డుకు ఇరువైపులా నాణ్యమైన కంచె, సేద తీర్చుకునేందుకు అరుగులు ఏర్పాటుచేయాల్సి ఉంది. వీటి నిర్మాణానికి రూ.94లక్షల్లో కేంద్రం వాటా 40శాతం, రాష్ట్ర ప్రభుత్వం 50శాతం, మిగిలిన పది శాతం నగర పంచాయతీ నుంచి విడుదల చేశారు. అయితే చెరువులోపల మాత్రం రెండు వైపులా కంచెమాత్రమే వేశారు. అరకొరగా పనులను చూపించి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 40శాతం నిధులు అంటే దాదాపు రూ.40లక్షలు స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

నెరవేరని వాకర్ల కల

భోగసముద్రం చెరువుకట్టపై వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఈ క్రమంలో ఇక్కడ వాకింగ్ ట్రాక్ ఏర్పాటుచేస్తే బాగుంటుందనే వాకర్ల కలగానే మిగిలింది. దాదాపు రెండేళ్లు దాటినా గడ్డి మొక్క తీసిందిలేదు కానీ రూ.45లక్షలు స్వాహా అయ్యాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అమృత్ 2.0 పర్యవేక్షణ అధికారులు దర్యాప్తు చేస్తే అవినీతి గుట్టు రట్టు అవుతుందని అంటున్నారు.

దర్యాప్తు చేయాలి



వాకింగ్ ట్రాక్ పనులకు సంబంధించి పూర్తిగా దర్యాప్తు చేయాలి. ఎంత నిధులు విడుదల చేశారు..? ఎంత అభివృద్ధి జరిగింది..? అన్నది నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది.

-వేదవ్యాస్, పెనుకొండ

రికార్డులు లేవు

వాకింగ్ ట్రాక్‌కు సంబంధించిన రికార్డులు మావద్దలేవు. చెరువువద్ద వాకింగ్ ట్రాక్ పనులపై ఆరాతీస్తాం. గతంలో ఇక్కడ పనిచేసి వెళ్లిన కమిషనర్‌తో మాట్లాడి రికార్డులు వెలికి తీస్తాం.

-సతీష్‌కుమార్, నగర పంచాయతీ కమిషనర్

సమాజానికి నాగరికత నేర్పింది చేనేతలే

● మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప



మాట్లాడుతున్న నిమ్మల కిష్టప్ప

గోరంట్ల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సమాజానికి నాగరికత నేర్పింది చేనేత కార్మికులేనని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ నిమ్మలకిష్టప్ప అన్నారు. గోరంట్లలోని చౌడేశ్వరీ కాలనీలో జాతీయ చేనేత కార్మిక దినోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం తరువాత అతి పెద్ద పరిశ్రమచేనేత అన్నారు. చేనేత కార్మికుల పరిస్థితులు, జీవనోపాధి, రోజురోజుకు కష్టంగా మారుతోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణీ, దేవాంగం క్రిష్టప్ప, మాజీ వార్డు సభ్యులు నాగరాజు, రమణ పాల్గొన్నారు.

గోరంట్ల, (ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత కార్మిక దినోత్సవం సందర్భంగా గోరంట్లకు చెందిన కౌసల్యకు టీడీపీ నాయకుడు నిమ్మల శ్రీధర్ నిత్యావసర వస్తువులను గురువారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లికార్జున, సుధాకర్, రామచంద్ర, మహేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి: సీపీఐ

సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నాయకులు గురువారం తహసీల్దార్ మారుతికి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ వ్యవసాయం తరువాత అతిపెద్దపరిశ్రమ అయిన చేనేత రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలస్వామి, రాజగోపాల్, గంగరాజు, మారుతి, చంద్రశేఖర్, ఆనంద్ పాల్గొన్నారు.

ప్రభుత్వం మరిన్ని పథకాలు ప్రవేశపెట్టాలి

- కార్మిక సంఘం నాయకుడు నారాయణస్వామి

సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేతల దినోత్సవాన్ని గురువారం నేతన్నలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని చేనేత సర్కిల్‌లో పతాకావిష్కరణ చేసి కేక్‌కట్ చేశారు. కార్మిక సంఘం నాయకులు చీల నారాయణస్వామి మాట్లాడుతూ మనిషి మానాన్ని కాపాడే కుల వృత్తి ఒక చేనేతదేనన్నారు. ప్రస్తుతం చేనేత పరిశ్రమ అస్తవ్యస్తంగా మారిందని, ప్రభుత్వం చేనేతలను ఆదుకునేందుకు మరిన్ని పథకాలు ప్రవేశపెట్టాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వారానికోరోజు చేనేత వస్త్రాలు ధరించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో దాసరి సుధాకర్, బెస్తకిష్టప్ప, ఈడిగ నాగరాజు, కుమార్, కుమ్మరి కిష్టప్ప, నాగరాజు, ఈశ్వర్, నారాయణస్వామి, శ్రీనివాసులు, బెస్త వెంకటేశులు, నరసింహులు పాల్గొన్నారు.



చేనేత జెండాలు ఆవిష్కరిస్తున్న నేతన్నలు

ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి స్థల పరిశీలన

రొద్దం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రొప్పాల పరిధిలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం కోసం గురువారం అధికారులు స్థల పరిశీలన చేశారు. తాగునీటి సమస్యను పరిష్కరించేనిమిత్తం స్థల పరిశీలన చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ జేఈ వెంకటనారాయణ, వీఆర్ఓ రాము, కాంట్రాక్టర్ కౌషిక్, కన్వీనర్ నరహరి, గోపీ, నాయకులు రాము, శంకర్ ఉన్నారు.

క్రికెట్ కిట్ల వితరణ

మడకశిర రూరల్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌడనహళ్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.20 వేలు విలువచేసే క్రికెట్ కిట్లను రిటైర్డ్ హెచ్ఎం నరేంద్ర గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని నింపేందుకు కిట్లను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి, పీడీ అరుణ పాల్గొన్నారు.

పాముకాటుతో యువకుడి మృతి



అనిల్‌కుమార్ (ఫైల్)

పరిగి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాలువపల్లి గ్రామానికి చెందిన అనిల్‌కుమార్(22) పాముకాటుతో బుధవారం రాత్రి మృతిచెందాడు. స్థానికులు అందిర్చిన సమాచారం మేరకు ఇటుకల బట్టీలో తన స్నేహితులతో కలిసి నిద్రించేవాడు. బుధవారం రాత్రి నిద్రిస్తుండగా పాము కాటువేయడంతో చీమ కరిచి ఉంటుందని భావించి అనిల్‌కుమార్ అలాగే నిద్రపోయాడు. ఉదయం వాంతులు కావడంతో స్నేహితులు తండ్రికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి చికిత్సలు అందిస్తుండగా మృతిచెందాడు. జమేదార్ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాత్కాలికంగా దారి మూసివేత

పెనుకొండ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పెనుకొండ నుంచి కోనాపురం వెళ్లే రహదారిలో నారాయణమ్మ కాలనీ వద్ద డ్రైనేజీ కాలువ పనులు చేపడుతుండడంతో ఆ దారిని తాత్కాలికంగా మూసివేసినట్లు నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

పరిగి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బిందునగర్‌లో సన్నక్కను కర్రతో కొట్టి చంపిన కేసులో నిందితుడిని గురువారం అరెస్టు చేసినట్లు సీఐ రాఘవన్ తెలిపారు. 11 ఏళ్ల నుంచి సన్నక్క.. నవీన్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం కలిగి ఉండేది. తరచూ మద్యం సేవిస్తుండేది. ఈ క్రమంలో అదేకాలనీలో అద్దె ఇంట్లో ఉన్న బేల్దారి బోయ నాగరాజుతో పరిచయం ఏర్పడింది. అది వారి మధ్య వివాహేతర సంబంధానికి కారణమైంది. బోయ నాగరాజుతో కలిసి ఆమె మద్యం సేవిస్తుండేది. తరచూ బోయ నాగరాజును ఆమె అందరి సమక్షంలో అవహేళన చేస్తుండేది. దీంతో విసుగుచెందిన నాగరాజు.. సన్నక్కను కొట్టి చంపి కొడిగెనహళ్లి సచివాలయం వద్ద వీఆర్ఓ కృష్ణమూర్తి వద్ద లొంగిపోయాడు. తానే చంపినట్లు ఒప్పుకోవడంతో కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించారు. కార్యక్రమంలో ఎస్ఐ రంగడుయాదవ్, జమేదార్ సునీల్‌నాయక్, సిబ్బంది సురేష్, శివ, రామాంజి, నాగార్జున తదితరులు ఉన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

గోరంట్ల, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సింగిరెడ్డిపల్లి రహదారిలో రావికుంట చెరువు కట్టపై గురువారం సాయంత్రం వాకింగ్‌కు వెళ్తున్న శ్రీలత మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ద్విచక్రవాహనంపై ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు శ్రీలత మెడలోని బంగారు గోలుసును లాక్కొని సింగిరెడ్డిపల్లి వైపు వేగంగా వెళ్లారు. బాధితురాలి సమాచారం మేరకు పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా చర్యలు చేపట్టారు.

ఘనంగా శ్రీచక్రపూజ



పూజల్లో పాల్గొన్న భక్తులు

మడకశిర టౌన్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన షిర్డీసాయినాథ ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని గురువారం ఆలయంలో శ్రీచక్రపూజను కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు అర్చనల అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

రైతు సేవా కేంద్రంగా మార్పు

గుడిబండ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరహట్టి గ్రామంలోని రైతు సేవాకేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసింది. అయితే వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యం కారణంగా రైతు భరోసా కేంద్రం కేంద్రంగా ఉంచారు. రైతు భరోసా మార్చండి అనే శీర్షికను ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. వ్యవసాయాధికారులు స్పందించి రైతు సేవా కేంద్రంగా మార్చారు.

స్పెషల్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల వెల్లువ



పరిగిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం జమకాని వారి కోసం నిర్వహించిన స్పెషల్ గ్రీవెన్స్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మండల కేంద్రాల్లోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదులను అధికారులు, టీడీపీ నాయకులు తీసుకున్నారు. అర్హులైన వారికి తప్పకుండా ఖాతాల్లోకి డబ్బు జమ అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటామని వారు లబ్ధిదారులకు హామీ ఇచ్చారు.

- న్యూస్ నెట్‌వర్క్, (ఆంధ్రజ్యోతి)

ఘనంగా పట్టాభిషేక దినోత్సవం

గోరంట్ల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల 516వ పట్టాభిషేక దినోత్సవాన్ని గోరంట్లలో గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మధుసూదన్‌యాదవ్, కృష్ణవర్ధన్‌రెడ్డి, నారాయణస్వామి, మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



కలశాలతో ప్రదర్శనగా వస్తున్న మహిళలు

రొద్దం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శేషాపురం గ్రామంలో పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ గురువారం వైభవంగా జరిగింది. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మహిళలు కలశాలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోమశేఖర్‌రెడ్డి, అరుణ్‌రెడ్డి, మంజునాథ్, కమలాకర్, మారుతిరెడ్డి పాల్గొన్నారు.

రుణాలపై రైతులకు అవగాహన



రుణాలపై అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

రొద్దం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘం సభ్యులు, రైతులకు ఇచ్చే రుణాలపై గురువారం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రొద్దం మండలంలోని తురకలాపట్నం గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. రైతులకు తత్కాల్ లోన్లు, మహిళా సంఘాలకు లగుపతిలోన్‌లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం నారాయణ, ఫీల్డ్ ఆఫీసర్ మీనాక్షి, సీసీ బాబయ్య, వీఏఓ అనితలక్ష్మీ, టీడీపీ నాయకులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గంబూషియా చేపలతో దోమల వ్యాప్తికి చెక్

మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా



నీటికుంటలోకి గంబూషియా చేపలను వదులుతున్న అధికారులు

మడకశిర రూరల్/టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): డెంగీ, మలేరియా, గున్యా తదితర జ్వరాలను వ్యాపింపచేసే దోమలను అరికట్టేందుకు మలేరియా యూనిట్ ఆధ్వర్యంలో గురువారం నీటికుంటలోకి గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా మాట్లాడుతూ గంబూషియా చేపలు నీటిలోని దోమల లార్వాలను తినటం జరుగుతుందని, తద్వారా దోమలవ్యాప్తిని అరికడతాయన్నారు. దోమలవ్యాప్తికి చెక్ పెట్టవచ్చన్నారు. మండలంలోని చందకచర్ల గ్రామసమీపంలోని నీటికుంట, పట్టణసమీపంలోని చాకలికుంట, శివాలయం వద్ద ఉన్న నీటి కుంటల్లోకి గంబూషియా చేపలను వదలడం జరిగిందన్నారు.

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): దోమల వ్యాప్తిని అరికట్టేందుకు వైద్యాధికారులు గురువారం గోరంట్లలో చర్యలు చేపట్టారు. పట్టణంలోని రావికుంట, చిత్రావతి నది పరివాహక ప్రాంతాలు, మండలంలోని కొండాపురం చెరువు నీటిలో గంబూసియా చేపలను వదిలారు. కార్యక్రమంలో హిందూపురం మలేరియా సబ్ యూనిట్ అధికారి శివన్న, సూపర్‌వైజర్ గంగాధర్, కార్యదర్శి సోముశేఖర్, వైద్య సిబ్బంది రంగనాథ్, శ్రీకాంత్, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు

మున్సిపల్ చైర్మన్ రమేష్

చిలమత్తూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కూటమి ప్రభుత్వంలో సాధ్యమవుతున్నాయని హిందపురం మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. చిలమత్తూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా వీరాపురం చెన్నమ్మ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు అన్ని రకాలుగా అన్యాయం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే బాలకృష్ణ మహిళలకు రాజకీయంగా అన్ని అవకాశాలను కల్పిస్తున్నారన్నారు. మండల కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల వారిని గుర్తించి వారికి న్యాయం చేయడం కేవలం టీడీపీకే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బేవనహళ్లి ఆనంద్, నాగరాజు, అంజినప్ప, లక్ష్మీనారాయణయాదవ్, రంగారెడ్డి, పరిమళ, శ్రీదేవి, లక్ష్మిదేవి, నాగేంద్ర పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ

లేపాక్షి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ గురువారం ప్రారంభించారు. తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటీవల తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ కార్యాలయానికి మరమ్మతులు చేయించారు. కార్యాలయానికి ఎంతో చక్కగా మరమ్మతులు చేయించారని ఆర్డీఓ తహసీల్దార్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహమూర్తి పాల్గొన్నారు.

కేసు కొట్టివేత

రొళ్ల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఐకేపీ యానిమేటర్లపై పెట్టిన కేసు కొట్టేయడంతో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, యానిమేటర్లు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ తమ నిరసన వల్ల ప్రభుత్వానికి ఎలాంటి నష్టం వాటిల్లదేని న్యాయమూర్తి తీర్పునిచ్చి దీంతో కేసు కొట్టివేయడం జరిగిందన్నారు.

స్వామినాథన్‌కు ఘననివాళి

పెనుకొండ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): హరిత విప్లవ సృష్టికర్త భారతరత్న స్వామినాథన్ జయంతిని స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. నాయకులు హరీ, బాబావలి, మహబూబ్‌బాష, వెంకటేశులు, నాగమ్మ, లక్ష్మీనరసమ్మ, రైతులు స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

పగిలిన పైప్‌లైన్.. వృథా అవుతున్న నీరు

గుడిబండ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గుడిబండ చెరువు సమీపంలోని శ్రీరామిరెడ్డి తాగునీటి పైప్‌లైను పగిలిపోవడంతో నీరు వృథాగా పోతోంది. అయితే సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.